మహబూబ్‌నగర్ వార్త
నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల / నారాయణపేట



# నేడే 'ఉప'పోరు..!

- స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక నేడు
- 10పోలింగ్ కేంద్రాలు..15మంది మైక్రో అబ్జర్వర్లు
- ఏర్పాట్లు సిద్ధం చేసిన అధికార యంత్రాంగం
- ఏప్రిల్ 2న తేలనున్న అభ్యర్థుల భవితవ్యం
- క్యాంప్‌లనుంచి నేరుగా పోలింగ్ కేంద్రాలకే ఓటర్లు..!



**మహబూబ్‌నగర్ బ్యూరో, మార్చి 27, ప్రభాతవార్త :** మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల నియోజకవర్గ శాసనమండలి ఉప ఎన్నికకు గురువారం పోలింగ్ జరగనున్నది. ప్రధానంగా పోటీ కాంగ్రెస్ అభ్యర్థి మన్నె జీవన్‌రెడ్డి , బీఆర్ఎస్ అభ్యర్థి నవీన్‌రెడ్డి మధ్యే ఉన్నట్లు తెలుస్తున్నది. అయితే ఇండిపెండెంట్ అభ్యర్థిగా రాష్ట్ర ఎంపీటీసీల సంఘం అధ్యక్షుడు కుమార్‌గౌడ్ ఉన్నారు. ఉప ఎన్నికలో ఎలాగైనా గెలుపొందాలని ఓటర్లను ఒక్కొరికీ రూ.3నుంచి 5క్షల వరకు పంపిణీ చేసి కుటుంబ సభ్యులు, సన్నిహితులతో సహా ఓటర్లను ఇప్పటికే క్యాంపులకు తరలించారు. నేడు ఉమ్మడి జిల్లాలో 10 పోలింగ్ కేంద్రాలు ఉప ఎన్నికకు పోలింగ్ జరగనుండగా ఏప్రిల్ 2న ఫలితాలు వెలువడనున్నాయి. ఎమ్మెల్సీ ఉప ఎన్నికలో ఎంపీలు 2, 3 ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు 14, జెడ్పీటీసీలు 83,కౌన్సిలర్లు 449, ఎంపీటీసీలు 888 కలిపి మొత్తం 1439మంది సభ్యులు ఓటింగ్‌లో పాల్గొననున్నారు. ప్రాధాన్యత ఓట్లు ప్రకారం విజేతను ప్రకటిస్తారు. అయితే బీఆర్ఎస్ పార్టీకి సంఖ్యాబలం ఉండడంతో అభ్యర్థి నవీన్‌రెడ్డి తానే గెలుస్తామనే ధీమాలో ఉన్నారు. గత ప్రభుత్వంపై వ్యతిరేఖత ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉండడంతోపాటు తమకు అనుకూలంగా ఓటు వేస్తారని, చాలా మంది ఇప్పటికే హస్తం గూటికి చేరడంతోపాటు చేరని వాళ్ల కూడా చేరేందుకు సిద్ధంగా ఉన్నట్లు సమాచారం. దీంతో మన్నె జీవన్‌రెడ్డి కూడా తానే గెలుస్తాననే ధీమా వ్యక్తం చేస్తున్నారు.

**పోలింగ్ సామగ్రి పంపిణీ..**

ఎమ్మెల్సీ ఉప ఎన్నికకు సంబంధించి బుధవారం ఎన్నికల సిబ్బందికి సామగ్రినీ పంపిణీ చేశారు. పట్టిష్ట బందోబస్తు మధ్య ఎస్కార్ట్‌తో పోలింగ్ కేంద్రాలకు సామగ్రి పంపిణీ చేశారు. పోలింగ్ వెబ్ క్యాస్టింగ్ వీడియోగ్రఫీ నిర్వహించనున్నారు. ఈమేరకు జెడ్పీ సీఈవో,మున్సిపల్ కమిషనర్లు ఓటర్లకు ఐడీ కార్డులు జారీ చేశారు. ఉప ఎన్నికకు సంబంధించి మహబూబ్ నగర్‌లోని సమీకృత కలెక్టరేట్ భవన సముదాయ కార్యాలయంలో ఈనెల 23,26న రెండు విడుతల్లో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. పోలింగ్ ప్రక్రియ బ్యాలెట్ పేపర్ ఆధారంగా జరుగనుండడంతో సిబ్బంది రెండు విడుతలుగా శిక్షణా కార్యక్రమాలు ఏర్పాటుచేశారు. ఈమేరకు పారదర్శంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ జి రవినాయక్ , ఎన్నికల పరిశీలకురాలు వాణీ ప్రసాద్ తెలిపారు. మహబూబ్‌నగ్ స్థానిక సంస్థల నియోజకవర్గ శాసనమండలి ఉప ఎన్నికల ఏర్పాట్లపై నియోజకవర్గ పరిధిలోని మహబూబ్‌నగర్. నారాయణపేట, నాగర్‌కర్నూల్, గద్వాల,వనపర్తి, వికారాబాద్, రంగారెడ్డి జిల్లాల ఏఆర్‌వోలు, ఉప ఎన్నిక నిర్వహణకు నియమించిన నోడల్ అధికారులతో వెబెక్స్ సమావేశం నిర్వహించి పోలింగ్, కౌంటింగ్, ఏర్పాట్లపై సూచనలు చేశారు.

**వారం రోజులు జల్సాలు..**

కౌన్సిలర్లు, ఎంపీటీసీలు, జెడ్పీటీసులు ఉప ఎన్నిక నేపథ్యంలో గత వారం రోజులుగా క్యాంప్‌ల్లో జల్సాలు చేస్తున్నారు. కేవలం ఓటర్లే కాదే వారి బంధువులు, కుటుంబ సభ్యులు, సన్నిహితులు సైతం క్యాంపుల్లో ఎంజాయ్ చేశారు. పబ్‌లు, డిస్కోలతో ఫుల్ ఎంజాయ్ చేసినట్లు పలువురు సభ్యులు తెలిపారు. నేడు పోలింగ్ జరగనున్న నేపథ్యంలో నేరుగా పోలింగ్ కేంద్రాల వద్దకే ఓటర్లను బస్సులు, ఇతర ప్రత్యేక వాహనాల్లో తరలించనున్నట్లు తెలుస్తున్నది. అయితే బీఆర్ఎస్, కాంగ్రెస్ ఇరువురు అభ్యర్థులు క్యాంప్ రాజకీయాలు నిర్వహించిన నేపథ్యంలో ఫలితాల అనంతరమే ఎవరి బలం ఎంతో, క్యాంప్ రాజకీయాలు ఎవరికి ఉపయోగపడ్డాయో తెలుస్తుంది.

## ఎలాంటి పొరపాట్లకు..

# తావివ్వద్దు..!

- ఎమ్మెల్సీ ఉప ఎన్నిక
- పకడ్బందీగా నిర్వహించాలి
- ఎన్నికల రిటర్నింగ్ అధికారి కలెక్టర్ జి.రవినాయక్
- సిబ్బందికి ఎన్నికల సామాగ్రి పంపిణీ



మాట్లాడుతున్న ఎన్నికల అధికారి కలెక్టర్ రవినాయక్



హాజరైన ఎన్నికల అధికారులు, సిబ్బంది, పిఓలు, ఎపిఓలు

**మహబూబ్‌నగర్ బ్యూరో,మార్చి 27 ప్రభాతవార్త :** స్థానిక సంస్థల నియోజకవర్గ శాసనమండలి ఉప ఎన్నిక సజావుగా నిర్వహించేందుకు ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల మేరకు విధులు నిర్వహించాలని రిటర్నింగ్ అధికారి, మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టర్ జి. రవినాయక్ అన్నారు. బుధవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ భవనంలోని సమావేశ మందిరంలో ఈనెల 28న జరగనున్న మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల శాసనమండలి ఉప ఎన్నిక నిర్వహణ పోలింగ్‌కు నియమించిన జోనల్ అధికారులు, రూట్ అధికారులు, సెక్టార్ అధికారులు, పిఓలు, ఎపిఓలకు తుది శిక్షణా కార్యక్రమం నిర్వహించి మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల నియోజకవర్గ పరిధిలోని 10 పోలింగ్ కేంద్రాలకు పోలింగ్ కేంద్రాల వారిగా బ్యాలెట్ బాక్సులు, పోలింగ్ మెటీరియల్ పంపిణీ చేశారు. పోలింగ్ సిబ్బంది పోలింగ్ మెటీరియల్‌తో పోలింగ్ కేంద్రంకు చేరుకుని ఉప ఎన్నిక ఏర్పాట్లు చూసుకోవాలని అన్నారు. ఈసందర్భంగా రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జోనల్ అధికారులు, సెక్టార్ అధికారులు, రూట్ అధికారులు, పిఓ, ఎపిఓలు ఎన్నికల నియమ నిబంధనలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని, ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా ఎమ్మెల్సీ ఉప ఎన్నిక విజయవంతంగా నిర్వహించాలని కోరారు. పోలింగ్ సందర్భంగా నిర్వహించనున్న అన్ని విషయాలపై శిక్షణ ద్వారా అవగాహన కలిగించి సందేహాలు నివృత్తి చేశారు. ఎమ్మెల్సీ ఉప ఎన్నిక ఈవిఎంల ద్వారా కాకుండా బ్యాలెట్ ద్వారా నిర్వహిస్తున్నందున పిఓ, ఎపిఓలు బ్యాలెట్ బాక్సులు ఓపెన్ చేయడం, మూసివేయడం, సీలింగ్ చేసే పద్ధతిని గురించి తెలుసుకోవాలని అన్నారు. బ్యాలెట్ పేపర్ ఎలా మడతపెట్టాలి, సంతకం ఎక్కడ, ఎలా పెట్టాలి అంశాలపై జాగ్రత్త వహించాలన్నారు. పోలింగ్ రోజు బాధ్యతగా ఎక్కడ లోపాలు లేకుండా బాధ్యతలు నిర్వర్తించాలని అన్నారు. పోలింగ్ డే రోజు పోలింగ్ కేంద్రం లోపలికి ఒకేసారి ఎక్కువ మందిని అనుమతించకుండా నలుగురు ఓటర్లను మాత్రమే లోపలికి పంపించాలన్నారు. బ్యాలెట్ బాక్సు లోపల నియోజకవర్గం, పోలింగ్ స్టేషన్, పోలింగ్ తేదీ వివరాలను కలిగి ఉన్న చిరునామా ట్యాగ్‌ను ఉంచడంతో పాటు ఒక లేబుల్‌ను, బ్యాలెట్ బాక్సు వివరాలు, బ్యాలెట్ పెట్టె క్రమసంఖ్య వంటి విషయంలో చాలా జాగ్రత్త వహించాలని తెలిపారు. బ్యాలెట్ బాక్స్ ఖాళీగా ఉందని అభ్యర్థులకు వారి ఏజెంట్లకు చూపించిన తర్వాత పోలింగ్ కోసం బ్యాలెట్ పెట్టెను సిద్ధం చేయడం, అభ్యర్థులు, ఏజెంట్లు సమక్షంలో బ్యాలెట్ పెట్టెను పోలింగ్ స్టేషన్‌లో ఏర్పాటు చేయాలన్నారు. బ్యాలెట్ పేపర్ అకౌంట్ సరి చూసుకోవాలని అన్నారు. ఓటరు గుర్తింపుకు ఎపిక్ కార్డు లేదా స్థానిక సంస్థల గుర్తింపు కార్డు, ఎన్నికల సంఘం నిర్దేశించిన 12 గుర్తింపు కార్డులలో ఏదైనా ఒక దానిని చూపించిన అనుమతించాలని, పోలింగ్ బూత్ ఏజెంట్ నియోజకవర్గంలోని ఓటరు అయి ఉండాలని పిఓలు, ఎపిఓలు శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకొని ఉప ఎన్నికను సమర్థవంతంగా నిర్వహించాలని ఆయన సూచించారు. మాస్టర్ ట్రైనర్ పరమేశ్ పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వారికి శిక్షణ నిర్వహించి సందేహాలను నివృత్తి చేశారు. సమావేశంలో ఎమ్మెల్సీ ఉప ఎన్నిక పరిశీలకురాలు అటవి, పర్యావరణ, శాస్త్ర, సాంకేతికశాఖ ముఖ్య కార్యదర్శి ఎ. వాణిప్రసాద్ ఎస్పీ హర్షవర్ధన్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్, రెవెన్యూ అదనపు కలెక్టర్ ఎస్.మోహన్‌రావు, మహబూబ్‌నగర్ డిఆర్‌ఓ కె.వి.వి. రవికుమార్ సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

### ప్రజలకు వైద్యం అందించేందుకు

## ఎల్లవేళలా కృషి చేయాలి:జిల్లా కలెక్టర్

**నారాయణపేట ప్రతినిధి, మార్చి 27 ప్రభాతవార్త :** బుధవారం విడియో కాన్ఫరెన్స్ హాల్‌లో వైద్యశాఖపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఏ సిబ్బంది ఏ పని నిర్వహిస్తున్నారో అడిగి తెలుసుకున్నారు. ఫీల్డ్‌లో ఏమి చేశారు, ఎన్ని ఇల్లు విజిట్ చేశారు తదితర వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. మందులు ఎలా ఇస్తున్నారు ఎలా పంపిణీ చేస్తున్నారు అడిగారు. ఫీల్డ్‌లో సబ్ సెంటర్లు పిహెచ్‌సిల వారిగా మందుల పంపిణీపై ఆరా తీశారు. లెప్రసీ కేసులు ఎన్ని వచ్చాయి మార్చిలో ఏ పని చేశారు అని అడిగి తెలుసుకున్నారు. జిల్లాల ట్రైస్ మేనేజ్‌మెంట్ ఎన్ని క్యాంపులు పెట్టారు. ఈ నెలలో ఇంకా ఎన్ని క్యాంపులు పెట్టలేదని అడిగారు. కమ్యూనిటీ మొబైలైజేషన్ అంటే ఎలా చేస్తారు తదితర వివరాలు అడిగి తెలుసుకున్నారు. మక్తల్‌లో ప్రైవేట్ ఆసుపత్రులకు ఎన్ని దరఖాస్తులు వచ్చాయని అడిగారు. కొత్తగా రెండు దరఖాస్తులు వచ్చాయని కలెక్టర్‌కు తెలిపారు. దరఖాస్తుల వారిగా ఇన్స్‌పెక్షన్ చేసి క్లియర్ చేయాలని ఆదేశించారు. ఎవరి పనులు వాళ్లే చేసుకోవాలని ఆదేశించారు. బయోమెట్రిక్ హాజరు లేకపోతే జీతం కట్ చేయాల్సి వస్తుందని డిఎంహెచ్‌ఓను హెచ్చరించారు. విధులకు మూడు రోజులు ఆలస్యమైతే జీతం కట్ చేస్తారని కలెక్టర్ తెలిపారు. టూర్ డైరీ ముందే సబ్మిట్ చేయాలని బయోమెట్రిక్ ప్రతిరోజు వేయాలని సిబ్బందిని ఆదేశించారు. సమావేశంలో డిఎంహెచ్‌ఓ సౌభాగ్యలక్ష్మి, డిప్యూటి డిఎంహెచ్‌ఓ, సిబ్బంది పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ కోయ హర్ష

## జడ్చర్ల రాజకీయాల్లోకి జక్కా..!

- నియోజకవర్గంతో 20ఏళ్ల అనుబంధం
- గతంలో బీజేపీ ఇన్‌చార్జిగా పని చేసిన అనుభవం
- ప్రస్తుతం పార్లమెంట్ ఎన్నికల గెలుపు బాధ్యతలు
- ఇటీవల బీజేపీ గూటికి చేరిన రఘునందన్‌రెడ్డి
- ఇటు నాగర్‌కర్నూల్, అటు మహబూబ్‌నగర్ పార్లమెంట్ కీలక బాధ్యతలు !



నాగర్‌కర్నూల్ సభలో మోడీతో జక్కా

**మహబూబ్‌నగర్ బ్యూరో,మార్చి 27, ప్రభాతవార్త :** జడ్చర్ల రాజకీయాల్లో జక్కా రఘునందన్‌రెడ్డి రెడ్డి ఎంట్రీ ఇవ్వనున్నారా.. గతంలో బీజేపీ జడ్చర్ల నియోజకవర్గ ఇన్‌చార్జిగా తనదైన శైలిలో బీజేపీ బలోపేతానికి కృషి చేసిన ఆయన సేవలను పార్టీ తిరిగి ఉపయోగించుకోనున్నదా..మహబూబ్‌నగర్ అభ్యర్థి డీకే అరుణ గెలుపులో తనపాత్ర కీలకంగా ఉండనున్నదా అంటే అవుననే అంటున్నారు పార్టీ వర్గాలు, ఆయన అభిమానులు. గత 20ఏండ్లుగా జక్కాకు జడ్చర్లతో అనుబంధం ఉన్నది. బీజేపీ బలోపేతానికి కూడా గతంలో ఆయన ఎంతో కృషి చేశారు. ఈక్రమంలో డీకే అరుణ పార్టీలోకి ఆహ్వానించడంతో జక్కా తిరిగి జడ్చర్ల వేదికగా కమలం బలోపేతానికి కార్యకలాపాలు ప్రారంభించనున్నట్లు తెలుస్తున్నది.

**గతంలో జడ్చర్ల ఇన్‌చార్జిగా..** జక్కా రఘునందర్‌రెడ్డి 20ఏళ్లకు పైగా ప్రత్యక్ష రాజకీయాల్లో ఉన్నారు. ఏబీవీపీ విద్యార్థి – మిగతా4లో..

## శ్రీరంగనాయక స్వామి ఆలయంలో సినీ హీరో సిద్దార్థ్,హీరోయిన్ అదితి రావు హైదరి సీక్రెట్ వివాహం..!

**శ్రీరంగాపురం మండలం,మార్చి 27,ప్రభాతవార్త :** మండల కేంద్రంలో ఉన్నటువంటి ప్రసిద్ధ శ్రీరంగనాయకస్వామి ఆలయంలో బుధవారం ప్రముఖ సినిమా నటుడు సిద్దార్థ్,నటి అదితి రావు హైదరి వివాహం రహస్యంగా జరిగింది. వివరాలలోకి వెళితే వీరిద్దరి పెళ్లికి ఇరు కుటుంబాల పెద్దలు,అత్యంత సన్నిహితులు,స్నేహితుల సమక్షంలో వారు పెళ్లి చేసుకుని ఏడడుగులు వేశారు.ఈ వివాహానికి తమిళనాడుకు చెందిన పురోహితులు సంప్రదాయబద్దంగా వివాహం జరిపించారు.కాగా వివాహం పూర్తయ్యే వరకు ఆలయంలోకి మీడియాను,స్థానికులకు గాని ఎవరిని అనుమతించకుండా కట్టుదిట్టంగా ఏర్పాటు చేయడం జరిగింది.పెళ్లి ఫోటోలు బయటకు రాకుండా ఆలయ కమిటీ సభ్యుల సెల్ ఫోన్ లను కూడా లోపలికి అనుమతించలేదు.వనపర్తి సంస్థానాధీశులు రాజా రామేశ్వరరావు స్వయాన మనుమరాలే ఈ అదితి రావు హైదరి,ప్రస్తుతం ఉన్న ఆలయ ధర్మకర్త శ్రీరాజా కృష్ణదేవరావు అక్క కూతరు హైదరి,కాగా దశాబ్దాల – మిగతా2లో..



## వేసవిలో తాగునీటి ఇబ్బందులు లేకుండా పటిష్ట చర్యలు..

### ఉపాధి హామీ పనుల్లో లేబర్ మొబిలైజేషన్ పెంచేవిధంగా చూడాలి జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

**వనపర్తి ప్రతినిధి మార్చి 27 ప్రభాతవార్త :** వనపర్తి జిల్లా వ్యాప్తంగా వేసవిలో ఇబ్బంది లేకుండా ఉండడానికి కలెక్టరేట్ లోని కాన్ఫరెన్సు హాల్లో తాగునీటి సమస్య,ఉపాధిహామీ పనులపై అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ సంచిత్ గంగ్వార్ తో కలిసి పంచాయతీరాజ్,మిషన్ భగీరథ,మున్సిపల్ కమిషనర్లతో వెబెక్స్ సమావేశం నిర్వహించారు.ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వనపర్తి జిల్లాలో తాగునీటికి ఎలాంటి కొరత లేదని మిషన్ భగీరథ నీటిని సరఫరా చేయడంలో సరైన పర్యవేక్షణ,సమన్వయం అవసరం ఉందన్నారు. కొన్నిసార్లు సరఫరాలో ఇబ్బందులు తలెత్తవచ్చని ప్రజలకు తాగు నీటి సరఫరా చేసే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు.ఇందుకు స్థానికంగా ఉన్న బోర్లు,మోటర్లు రిపేర్లు చేయించి పెట్టుకోవడం,లీకేజీలు లేకుండా చూసుకోవడం అవసరమైతే ప్రైవేట్ బోర్లు లీజుకు తీసుకుని నీటి సరఫరా సక్రమంగా జరిగే విధంగా చూడాలని సూచించారు. పంచాయతీ రాజ్,మిషన్ భగీరథ సిబ్బంది ఉదయాన్నే క్షేత్ర స్థాయిలో పర్యటించి తాగునీటి సమస్యలు తెలుసుకొని,పరిష్కారం చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.వారంలో 3 రోజులు తప్పనిసరిగా పంచాయతీ కార్యదర్శులు,ప్రత్యేక అధికారులు,ఎంపీడీఓలు క్షేత్ర స్థాయిలో పర్యటించాలని ఆదేశించారు.ఎట్టి పరిస్థితుల్లో వేసవిలో ప్రజలకు తాగు నీటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.గ్రామాల వారీగా వేసవి యాక్షన్ ప్లాన్ సిద్ధం చేసుకోవాలని సూచించారు.నీటి సరఫరా వ్యవస్థ లో ఏమైనా సమస్యలు ఉంటే గుర్తించి త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. అదేవిధంగా,తాగు నీటి వృధాను అరికట్టి,నీటి పై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు.అదనపు కలెక్టర్ మాట్లాడుతూ మున్సిపాలిటీలు, గ్రామపంచాయతీల్లో నీటి వనరులు,సరఫరా వ్యవస్థలపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. సమస్యలను వేగంగా పరిష్కరించాలని ఆదేశించారు.ప్రజలు తమ సమస్యల కోసం సంప్రదించేందుకు పంచాయతీ కార్యదర్శి,ప్రత్యేకధికారి, ఎంపీటీఓ,ఎంపీఓ,ఆర్ డబ్ల్యూఎస్,అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఫోన్ నంబర్లు ప్రతి గ్రామపంచాయతీ భవనం ముందు బోర్డులు రాయించి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు.లేబర్ మొబిలైజేషన్ పెంచాలి ఉపాధి హామీ పనుల్లో లేబర్ మొబిలైజేషన్ తక్కువ ఉందని కారణాలపై నివేదిక సమర్పించాలని సిబ్బందిని కలెక్టర్ ఆదేశించారు. పని ప్రదేశాల్లో తాగునీరు,షేడ్ నెట్స్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు.ప్రతివారం సకాలంలో మస్టర్ పూర్తిచేసి సమయానికి కూలి డబ్బులు అందే విధంగా చూడాలని,నిర్లక్ష్యంగా బాధ్యతా రహితంగా ఉంటే కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చారించారు.నర్స రీలలో,హరితారంలో నాటిన మొక్కలకు సక్రమంగా నీటిని అందించి రక్షించాలని ఆదేశించారు.ప్రతి శుక్రవారం డ్రైడే నిర్వ హించాలని,ఫాగింగ్,బ్లీచింగ్ చేస్తూ దోమలు, అంటువ్యాధులు ప్రబలకుండా తగు ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ఈసమావేశంలో పి.డి డీఆర్డీఓ ఉమాదేవి,డీపీఓ రమణ మూర్తి,మిషన్ భగీరథ ఎస్.ఈ జగన్మోహన్,వెబ్ ఎక్స్ ద్వారా ఎంపీడీఓలు,ఎపి.ఓలు,డి.ఈలు పంచాయతీ సెక్రటరీలు తదితరులు పాల్గొన్నారు.




వెబెక్స్ సమావేశంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్

## జిల్లాలో స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉప ఎన్నికకు పకడ్బందిగా ఏర్పాట్లు పూర్తి..!

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, మార్చి 27 ప్రభాతవార్త:** మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల నియోజకవర్గ శాసనమండలి ఉప ఎన్నిక గురువారం నాగర్‌కర్నూల్ జిల్లాలో ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్ తెలిపారు. మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల నియోజకవర్గ శాసన మండలి ఉప ఎన్నిక ఏర్పాట్లపై జిల్లా పరిధిలోని అచ్చంపేట పట్టణ కేంద్రంలో ఏర్పాటు చేసిన జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల పోలింగ్ కేంద్రాలను బుధవారం ఆయన తనిఖీ చేశారు. ఉప ఎన్నిక నిర్వహణ పోలింగ్ ఏర్పాట్లపై మౌళిక వసతులను పరిశీలించి, అధికారులకు పలు సూచనలు చేశారు. ఏఆర్‌ఓలు, నోడల్ అధికారులు సమన్వయంతో పనిచేసి భారత ఎన్నికల సంఘం ఆదేశాలను అనుసరించి ఎటువంటి లోటుపాట్లు లేకుండా ఎన్నికలను ప్రశాంతంగా పూర్తి చేయాలన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నాగర్‌కర్నూల్ జిల్లాలో నాగర్‌కర్నూల్, కల్వకుర్తి, కొల్లాపూర్, అచ్చంపేట పట్టణంలో ఒక్కో పోలింగ్ కేంద్రం చొప్పున 4 పోలింగ్ కేంద్రాల్లో మొత్తం 319 మంది తమ ఓటు హక్కును వినియోగించుకునేలా ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కలెక్టర్ పేర్కొన్నారు. నాగర్‌కర్నూల్ నియోజకవర్గంలో 101 మంది, కొల్లాపూర్‌లో 67, అచ్చంపేటలో 79, కల్వకుర్తిలో 72 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. నాగర్‌కర్నూల్ పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాల పైకా భవనంలో పోలింగ్ కేంద్రం, కొల్లాపూర్ పట్టణంలోని బాలికల జూనియర్ కళాశాలలో రూమ్ నెం.5, అచ్చంపేట – మిగతా4లో..



అచ్చంపేటలో ఎన్నికల పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న దృశ్యం

### కల్వకుర్తి ప్రాంత అభివృద్ధికై

## కాంగ్రెస్ పార్టీలో చేరుతున్న...

- సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో కల్వకుర్తి ప్రాంత అభివృద్ధికి కృషి చేస్తా...
- మాజీ మంత్రి వర్యులు జక్కుల చిత్తరంజన్‌దాస్

**కల్వకుర్తి, మార్చి 27 ప్రభాతవార్త:** కల్వకుర్తి ప్రాంత అభివృద్ధికికై సీఎం రేవంత్‌రెడ్డితో కలిసి పనిచేయడానికి బీజేపీ పార్టీని వీడి కల్వకుర్తి ప్రాంత అభివృద్ధికై కాంగ్రెస్ పార్టీలో చేరుతునాన్నని మాజీ మంత్రి వర్యులు జక్కుల చిత్తరంజన్‌దాస్ స్పష్టం చేశారు. బుధవారం కల్వకుర్తి పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మన ప్రాంత వాసి ఎనుముల రేవంత్‌రెడ్డి సీఎం కావడం ఎంతో సంతోషకరమైన విషయమని ఆయన పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఎమ్మెల్యేగా, మంత్రిగా, ఓబీసీ రాష్ట్ర చైర్మన్‌గా ఉండి కల్వకుర్తి ప్రాంత అభివృద్ధికి ఎంతగానో కృషి చేశానని తెలిపారు. ఈ నెల 29 లేదా 30న సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నానని, నాగర్‌కర్నూల్ పార్లమెంట్ అభ్యర్థిగా మల్లురవి గెలుపు కోసం నిరంతరం శ్రమిస్తానన్నారు. ఉమ్మడి ఏపీలో మల్లురవి ఎంపీగా,నేను మంత్రిగా పనిచేశానని, ఇద్దరి మధ్య మంచి సన్నిహిత సంబంధాలు ఉన్నాయని, మరోసారి మల్లురవి గెలుపుకు అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తానన్నారు. బీజేపీ పార్టీకి రాజీనామా లేఖను పార్టీ అధ్యక్షులు కిషన్‌రెడ్డికి అందించానని తెలిపారు.బీజేపీ పార్టీని వీడి కాంగ్రెస్ పార్టీలో చేరుతున్న శుభ సందర్భంగా చిత్తరంజన్‌దాస్‌ను మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్‌కుమార్ సమక్షంలో శాలువాలతో ఘనంగా సన్మానించారు.విలేకరుల సమావేశంలో మాజీసర్పంచ్ బృంగి ఆనంద్‌కుమార్, కాంగ్రెస్ నాయకులు ప్రభాకర్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి,మిర్యాల శ్రీనివాస్‌రెడ్డి, చిన్న రాంరెడ్డి , చిగుర్లపల్లి సతీష్, కదారి సంతుయాదవ్, ఆంజనేయులు, శశికుమార్, జమ్ముల శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి వర్యులు జక్కుల చిత్తరంజన్‌దాస్



చిత్తరంజన్‌దాస్‌ను సన్మానిస్తున్న దృశ్యం

## భారీ దోపిడీ

### 12 తులాల బంగారు ఎత్తుకెళ్లిన దుండగులు



**నారాయణపేట ప్రతినిధి, మార్చి 27 ప్రభాతవార్త:** పట్టణంలోని రాఘవేంద్ర కాలనీలో గుర్తు తెలియని వ్యక్తులు బీరువాలను తెరిచి 12 తులాల బంగారు నగలను ఎత్తుకెళ్లిన సంఘటన ఆదివారం తెల్లవారుజామున జరిగింది. ఉక్కపోతకు తట్టుకోలేక కూలర్‌కు చల్లగాలి తాకేందుకు గాను ప్రధాన తలు పును తెరిచి పెట్టడంతో గుర్తు తెలియని వ్యక్తి ఇంట్లో ప్రవేశించి తాళం వెయ్యి ని బీరువాలో ఉంచిన సీక్రెట్ బాక్సులో తాళాలతో తెరిచి అందులో ఉంచిన 12 తులాల బంగారు నగలను కొంత నగదును ఎత్తుకెళ్లినట్లు సమాచారం అయితే జరిగిన సంఘట స్థలానికి మక్తల్ సిఐ చంద్రశేఖర్, ఎస్సై భాగ్య లక్ష్మిరెడ్డి, నరేష్, అశోక్, క్లూస్ టీమ్స్ పరిశీలించారు. ఇంటి యజమాని మన్యకొండ స్వామిదంపతులు చెప్పిన దాని ప్రకారంమగనూరు మండ లంలోని కొల్పూరు విద్యుత్ సబ్ స్టేషన్‌లో లైన్‌మెన్‌గా విధులు నిర్వహిస్తూ పట్టణంలోని రాఘవేంద్ర కాలనీలో బాలకృష్ణ ఇంట్లో దాదాపు మన్నెం లైన్ మెన్‌గా 5 సంవత్సరాలుగా ఇదే ఇంట్లో కిరాయి ఉన్నానని, ఈ సంఘటన ఎప్పుడు జరిగిందో తెలియదు గాని తెల్లవారుమున తన భార్య లేచి తమ పిల్లలు కరాటే క్లాస్‌కు పంపించి తన భార్య స్వాతి బెడ్‌రూమ్‌లోకి చూడగా బీరువా బార్ల తెరిచి, బెడ్డుపై వస్తువులు చిందర వందరగా పడి ఉండడం చూసి దొంగతనం జరిగిందని భావించి ఘటన విషయాన్ని పోలీసులకు సమాచారం ఇచ్చినట్లు తెలిపారు. క్లూస్ టీంను రంగంలోకి దింపి సిఐ పరి సరాల్లో ఉన్నసిసి ఫుటేజ్‌లను పరిశీలించి అనుమానితులపై నిఘా పెట్టామని కేసు నమోదు చేసుకున్న పోలీసులు త్వరలో దొంగలను పట్టుకుంటామని సిఐ చంద్రశేఖర్ తెలిపారు.

## కోలాటం విజేతలకు బహుమతులు ప్రదానం



విజేతలకు బహుమతులు అందజేస్తున్న సీనియర్ న్యాయవాది కర్నె లక్ష్మినారాయణ

**ఉప్పునుంతల, మార్చి 27 ప్రభాతవార్త:** మండలంలోని మామిళ్ళపల్లి గ్రామంలో శ్రీ లక్ష్మినరసింహస్వామి బ్రహ్మోత్సవ కార్యక్రమంలో భాగంగా మంగళ వారం రాత్రి ఉత్సవ కమిటి ఆధ్వర్యంలో నిర్వహించిన కోలాటం పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. మొత్తం టీంలు పాల్గొనగా, ప్రథమ బహుమతిగా మల్కాపురం గ్రామానికి చెందిన వారు గెలుపొందడంతో వారికి సీనియర్ న్యాయవాది, కంసానిపల్లి గ్రామ మాజీ సర్పంచ్ కర్నె లక్ష్మినారాయణ రూ.15 వేల నగదు బహుమతి అందజేశారు. ద్వితీయ బహుమతి తాండ్ర గ్రామానికి చెందినవారు గెలుపొందడంతో మొకురాల ఆంజనేయులుగౌడ్ 10 వేలు అందజేశారు. తృతీయ బహుమతి అంబటిపల్లి గ్రామానికి చెందినవారు గెలుపొందడంతో దాసర్లపల్లి మాజీ సర్పంచ్ స్వర్ణలత 5 వేలు అందజేశారు. నాలుగో బహుమతి గడ్డంపల్లి గ్రామానికి చెందిన వారు గెలుపొందడంతో దుద్దుసాయిబాబు 3 వేలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటి ఛైర్మన్ మాధవరం రాజల్‌రావు, సీఈఓ శ్రీనివాసరావు, ఉత్సవ కమిటి సభ్యులు తదితరులున్నారు. నేడు వృషభరాజుల అంతర్రాష్ట్ర పోటీలు మామిళ్ళపల్లి శ్రీ లక్ష్మి నరసింహస్వామి బ్రహ్మోత్సవాల కార్యక్రమంలో భాగంగా నేడు గురువారం అంతర్రాష్ట్ర వృషభరాజుల పోటీ నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటి సభ్యులు, ఉత్సవ కమిటి ఛైర్మన్ మాధవరం రాజల్‌రావు, ఈఓ శ్రీనివాసరావు తెలిపారు. ఈ పోటీలను తిలకించేందుకు వచ్చిన భక్తులకు, ప్రజలకు ఉప్పునుంతల మండలం లత్తిపూర్ గ్రామానికి చెందిన ఎద్దుల నరేష్ యాదవ్ ఆర్థిక సహకారంతో అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వారు పేర్కొన్నారు.

## రేపు పీయూలో ప్లాస్టిక్ నివారణపై వర్క్‌షాపు



**మహబూబ్‌నగర్ బ్యూరో, మార్చి 27 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి, కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్, పాలమూరు విశ్వ విద్యాలయాలు సంయుక్తంగా అకాడమిక్ బ్లాక్‌లో రెడ్యూసంగ్ వాటర్ ఫుట్ ప్రింట్ అండ్ అవాయిడింగ్ సింగిల్ యూజ్ ప్లాస్టిక్ అనే అంశంపై వర్క్‌షాపు నిర్వహిస్తున్నట్లు ఉపకులపతి ప్రొ॥ లక్ష్మికాంత్ రాథోడ్ తెలిపారు. దీనికి సంబంధించి బుధవారం పరిపాలన భవనంలో అధికారులతో కలిసి విసి బ్రోచర్ విడుదల చేశారు. ఈ సందర్భంగాఏర్పాటు చేసిన సమావేశంలో పర్యావరణంపై ప్లాస్టిక్ వినియోగం ఎలా ప్రభావితం చేస్తుందనే అంశం రిసోర్స్ పర్సన్ పద్మ వివరిస్తారని, ఈ వర్క్‌షాపుకు అధ్యాపకులు, స్కాలర్స్, విద్యార్థులు హాజరు కానున్నారని తెలిపారు. ఇంకా ఈ కార్యక్రమంలో ఇంఛార్జి రిజిస్ట్రార్ డా. మధుసూదన్‌రెడ్డి, కోఆర్డినేటర్ డా. అదేర్ల కరుణాకర్‌రెడ్డి, ప్రిన్సిపాల్‌డా. బషీర్ అహ్మద్, విభాగాధిపత్తి డా. జంగం విశ్వనాథ్ పాల్గొన్నారు.

## సామాజిక తనిఖీ కోసం అన్ని రకాల రికార్డులను సిద్ధం చేయాలి : ఎంపిడిఓ

**లింగాల, మార్చి 27 ప్రభాతవార్త:** మహాత్మాగాంధి ఉపాధి పథకం పనులకు సంబంధించిన అన్నిరకాల రికార్డులను సామాజిక తనిఖీ కోసం సిద్ధంగా ఉంచాలని ఎంపిడిఓ ఆంజనేయులు అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంపిడిఓ కార్యాలయంలో ఉపాధి సిబ్బందికి పంచాయతీ కార్యదర్శులకు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఓ ఆంజనేయులు మాట్లాడుతూ గ్రామాల్లో ఉపాధి పనుల్లో కూలీల సంఖ్యను పెంచాలని సూచించారు. వేసవిలో గ్రామాల్లో నీటి ఎద్దడి రాకుండా తగు చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. పారిశుద్ధ్య పనులకు సంబంధించిన ఫోటోలు ప్రతి గ్రామ పంచాయతీ నుంచి పంపాలన్నారు. ఎస్ఎంఎస్ యాప్‌లో హాజరు తప్పనిసరిగా నమోదు చేయాలని సూచించారు. నర్సరీ నిర్వహణలో మొక్కలకు నీడకు ఏర్పాట్లు చేయలని కోరారు. చెంచుపేటలో చెంచులకు జాబ్‌కార్డులు అప్డేట్ చేయించాలన్నారు. మొక్కలకు (అవెన్యూప్లాంటేషన్) ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయాలని కోరారు. గ్రామాల్లో వందశాతం ఇంటి పన్నులు వసూలు చేయాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. ఎంపిపి కర్ణనాయక్, ఎపిఓ హిమామ్ అలీ, ఈసీశ్రీనివాస్, పంచాయతీకార్యదర్శులు, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

## వట్టెం వెంకన్న బ్రహ్మోత్సవాలు పరిసమాప్తి

**బిజినేపల్లి, మార్చి 27 ప్రభాతవార్త :** వట్టెం శ్రీ వెంకటేశ్వరస్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలు బుధవారం భక్తి శ్రద్ధల మధ్య ముగిశాయి. స్థానాచార్యులు సముద్రాలశ్రీమన్నారాయణ చార్యులు, ప్రధాన అర్చకులు వెంకట ప్రసాద చార్యులు ఆధ్వర్యంలో అర్చక బృందం శాస్త్రోక్తంగా వట్టెం వెంకన్న బ్రహ్మోత్సవాలు పరిసమాప్తి పలికారు. ప్రాతారారాధన, చతుస్థానార్చన, సేవా కాలం, హోమం, బాలభోగ నివేదన, మహా పూర్ణాహుతి, తీర్థప్రసాద గోష్ఠి నవకలశ స్నపనం, చక్రతీర్థం, అలంకారం రాజభోగ నివేదన, దేవతో ద్వాసనం, శ్రీ పుష్పయాగ ద్వాదశారాధన, సప్తవరణం, ధ్వజారోహణం, మూక బలి, యాజమాన ఆశీర్వచనం, ఆచార్యాది సన్మానములు, ఉత్సవ పరిసమాప్తికార్యక్రమాలు నిర్వహించారు. హోమం, అభిషేకం నిర్వహించి స్వామి వారి పుష్కరిణిలో చక్రస్నాన ఘట్టాన్ని భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై హరి నామ స్మరణ మధ్య పాల్గొన్నారు. అనంతరం శ్రీ పుష్పయాగ ద్వాదశారాధన, సప్తావరణం గావించి ధ్వజావరోహనతో ఆరు రోజులుగా సాగిన బ్రహ్మోత్సవాలను ముగించారు. ముగింపు కార్యక్రమంలో బ్రహ్మోత్సవ కైంకర్యపరులు అనంత క్రాంతికుమార్‌రెడ్డి దంపతులు, సందడి ప్రతాప్‌రెడ్డి సోదరులు, పెరుమాళ్ళ సచ్చిదానందరెడ్డి, పాండురంగారెడ్డి, నరెందర్‌రెడ్డి, చంద్రారెడ్డి, బండారురాజశేఖర్, జక్కాల్‌రెడ్డి, భాస్కరాచారి, నరసింహస్వామి, తివారీ, విజయ్‌మిశ్రా, శ్రీనివాస్, రామకృష్ణ, రామతేజ పాల్గొన్నారు.

# తాగునీటికి కటకట

◆ మల్కిమియన్ పల్లి గ్రామంలో తాగునీటికి ఇబ్బందులు

◆ పట్టించుకోని అధికారులు, ప్రజా ప్రతినిధులు



వ్యవసాయ బావుల నుంచి తాగునీటిని తెచ్చుకుంటున్న గ్రామస్తులు

**ఖిల్లాఘణపురం, మార్చి 27, ప్రభాతవార్త:** మండల పరిధిలోని మల్కిమియన్పల్లి గ్రామంలో గత 15 రోజులుగా త్రాగునీటి కోసం గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. సమీపంలోని వ్యవసాయ బావుల దగ్గరకు పోయి తెచ్చుకుంటున్నట్లు గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో త్రాగునీటి సమస్య గురించి ఎవరికి చెప్పుకోవాలో తెలియడం లేదని అన్నారు. గత ఫిబ్రవరి రెండవ తేదీ నుండి ప్రత్యేక అధికారుల పాలన రావడంతో సర్పంచుల మాజీలు అయిపోయారు దీంతో గ్రామాలలో సమస్యలు పేరుకుపోయాయి గత ఐదు నెలలుగా గ్రామాలలో పనిచేస్తున్న పారిశుద్ధ్య సిబ్బందికి వేతనాలు రావడం లేదని అలాగే గ్రామ పంచాయతీ ట్రాక్టర్కు డీజిల్కు కూడా డబ్బులు లేని ఇబ్బందులను ఎదుర్కొంటున్నట్టు సిబ్బంది తెలిపారు. ఈ ఏడాది వర్షాకాలంలో వర్షాలు సరిగ్గా కురవక పోవడం వల్ల త్రాగునీటి బోర్లు ఇంకిపోయాయని గ్రామా లలోని బోర్లు పనిచేయకపోవడం మిషన్ భగీరథ నీటిని కూడా అధికా రులు సరఫరా చేయలేకపోవడంతో తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొం టున్నట్టు గ్రామస్తులు తెలిపారు. రెండు మూడు రోజులకు ఒకసారి త్రాగు నీటివి వదులుతున్నారని గ్రామంలో నిరుపేద కుటుంబాలే ఎక్కువగా ఉంటాయని వీరికి సరిపడు త్రాగునీటిని నిలువ ఉంచుకోవడానికి సరైన సదుపాయాలు లేవన్నారు రోజు విడిచి రోజుతాగునీటి సరఫరా చేస్తేనే ఇబ్బందులు లేకుండా ఉంటాయన్నారు. లక్షలు పెట్టి సంపు నిర్మించారు కనెక్షన్ ఇవ్వడం మర్చిపోయారు మల్కిమియన్పల్లి ఈర్లతాండ గ్రామపం చాయతీ పరిధిలో రెండు గ్రామాలు ఐదు తండాలు ఉన్నాయి వనపర్తి జిల్లాకు చివరి గ్రామాలు కావడంతో ఆయా గ్రామాలకు మిషన్ భగీరథ నీళ్ల సరిగ్గా రావడం లేదు ఈ విషయమై అప్పటి సర్పంచులు జిల్లా అధికారులకు త్రాగునీటి విషయం వివరించడంతో ఏడాదిన్నర క్రితం బోడ గట్టు క్రింద సంపును ఏర్పాటు చేశారు. ఈర్లతాండవైపు కనెక్షన్ ఇచ్చారుకానీ మల్కిమియన్‌పల్లి గ్రామానికి కనెక్షన్ ఇవ్వకపోవ డంతో ఆఆ గ్రామంతో పాటు తండాలకు మిషన్ భగీరథ నీళ్ల సరిగ్గా రావడం లేదు సంబంధిత ఆర్డబ్ల్యూఎస్ జిల్లా అధికారుల స్పందించి సంపు నుండి 95 మీటర్ల కొత్త పైపులైను వేసి కనెక్షన్ ఇప్పించి త్రాగునీటి ఇబ్బందులను తొలగించాలని గ్రామస్తులు అధికారులు కోరుతున్నారు.



బుడగట్టు ప్రాంతంలో సంపులు నిర్మించిన దృశ్యం

# పోలింగ్ కేంద్రాల ర్యాండమైజేషన్

◆ 15 మంది సూక్ష్మ పరిశీలకుల నియామకం ◆ విధులపై అవగాహన కల్పించిన ఎన్నికల పరిశీలకురాలు వాణిప్రసాద్



మాట్లాడుతున్న ఎ.వాణిప్రసాద్

**మహబూబ్‌నగర్ బ్యూరో, మార్చి 27 ప్రభాతవార్త:** స్థానిక సంస్థల నియోజకవర్గ శాసనమండలి ఉప ఎన్నిక పోలింగ్‌కు ర్యాండమైజేషన్ నిర్వహించి రిజర్వ్ 5గురితో సహా మొత్తం 15 మంది సూక్ష్మ పరిశీలకులను (మైక్రో అబ్జర్వర్)లను నియమించారు. బుధవారం సమీకృత కలెక్టర్ కార్యాలయంలో రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ రవినాయక్ ఆధ్వర్యంలో ఎన్నికల కమిషన్ నియమించిన ఎమ్మెల్సీ ఉప ఎన్నిక పరిశీలకురాలు ఎ. వాణిప్రసాద్ 10 పోలింగ్ కేంద్రాలకు మైక్రో అబ్జర్వర్స్ ర్యాండమైజేషన్ ప్రక్రియను పూర్తి చేశారు. అనంతరం సూక్ష్మ పరిశీలకులతో సమావేశం నిర్వహించి సాధారణ ఎన్నికల పరిశీలకురాలు ఎ. వాణిప్రసాద్ పోలింగ్ సందర్భంగా వారు నిర్వహించాల్సిన విధులను గురించి అవగాహన కల్పించారు. సూక్ష్మ పరిశీలకులు పోలింగ్ కేంద్రాలలో పోలింగ్ ప్రక్రియను పరిశీలించి సాధారణ పరిశీలకురాలు చెక్‌లిస్టు ప్రకారం నమోదు చేసి రిపోర్టు సమర్పించాలని అన్నారు. ఎన్నికల కమిషన్ ప్రతినిధులుగా నిస్పక్షపాతంగా ఎటువంటి ఫిర్యాదులకు ఆస్కారం లేకుండా ఎన్నికల నిబంధనల మేరకు విధులు నిర్వర్తించాలని, ఓటింగ్ కంపార్టుమెంట్ వద్ద ఓటు గోప్యతను పాటించేలా విడియోగ్రఫీ నిర్వహించాలని సూచించారు. సమావేశంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

# గీత కార్మికుల పనిముట్ల కొనుగోళ్ల కోసం 20 కోట్లు నిధులు విడుదల




హైదరాబాదులోని గాంధీభవన్లో కల్లుగీత పారిశ్రామిక విభాగం చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టినటువంటి దృశ్యం

**ఆత్మకూర్, మార్చి 27, ప్రభాతవార్త:** రాష్ట్రవ్యాప్తంగా కల్లుగీత కార్మికుల పనిముట్ల కొనుగోళ్ల కోసం రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రివర్యులు 20 కోట్ల నిధులను విడుదల చేస్తున్నట్లుగా తెలంగాణ రాష్ట్ర కల్లుగీత పారిశ్రామిక సంఘం కన్వీనర్ నాగరాజు గౌడ్ ప్రభాతవార్తకు తెలిపారు. బుధవారం రోజు హైదరాబాదులోని గాంధీభవన్ లో కల్లుగీత పారిశ్రామిక ప్రత్యేక కార్యాలయ ప్రారంభోత్సవానికి ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ చేతులమీదుగా ప్రారంభించిన అనంతరం కల్లుగీత కార్మికుల కోసం ప్రత్యేక చర్యలు చేపట్టినట్లుగా ఆయన వివరించారు. ఈ మేరకు ఆయన ప్రభాత వార్తతో ఫోన్లో మాట్లాడుతూ రాష్ట్రంలోని నల్గొండ ఆదిలాబాద్ తదితర జిల్లాలలో ఈత చెట్లు ఎక్కి దిగేందుకు విదేశీ టెక్నాలజీతో కూడుకున్నటువంటి యంత్రాల కొనుగోళ్ల కోసం ప్రభుత్వానికి నివేదించే వెంటనే 20 కోట్ల నిధులను విడుదల చేసేందుకు ప్రభుత్వం సమ్మతించినట్లుగా నాగరాజ్ గౌడ్ ప్రభాతవార్తకు తెలిపారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా వ్యాప్తంగా ఈత వనాలను పెంపొందించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని ప్రతి ఐదుఎకరాల పరిధిలో గీతా కార్మికులకు ఈత చెట్లను ప్రభుత్వం ద్వారా పంపిణీ చేయించి ఈతవనాలను పెంపొందించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లుగా నాగరాజ్ గౌడ్ తెలిపారు. అంతేకాకుండా కంబోడియా దేశంలో ఉపయోగిస్తున్నటువంటి గీతా కార్మికుల పనిముట్ల విధానాలను అధ్యయనంచేసేందుకు గీతా కార్మికులను పంపించనున్నట్లుగా ఆయన వెల్లడించారు. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా కల్లుగీత కార్మికులకు కేవలం 5 లక్షల ప్రమాద బీమా మాత్రమే ఉన్న నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కలిసి విజ్ఞప్తి చేయడంతో పార్లమెంట్ ఎన్నికల అనంతరం ప్రతి గీతా కార్మికుడికి 10 లక్షల ప్రమాద బీమా ను పెంచేందుకు అంగీకారం తెలిపినట్లుగా ఆయన తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా కల్లుగీత కార్మికులకు ద్విచక్ర వాహనా పంపిణీ కోసం తక్షణమే చర్యలు చేపట్టినట్లగా ఆయన వెల్లడించారు. ముఖ్యమంత్రి ని కోరిన వెంటనే గాంధీభవన్లో కల్లుగీత పారిశ్రామిక ప్రత్యేక కార్యాలయ ప్రారంభోత్సవానికి అనుమతి లభించడంపట్ల కల్లుగీత కార్మికులపై ముఖ్యమంత్రికి చిత్తశుద్ధి ఎలా ఉందో కలలు గీత కార్మికులు అర్థం చేసుకోవాలని నాగరాజు గౌడ్ విజ్ఞప్తి చేశారు.

# తిరుమలనాథస్వామి ఆశీస్సులతో విజయం సాధిస్తా

**రామకొండ తిరుమలనాథస్వామి బ్రహ్మోత్సవ పల్లకి సేవలో కాంగ్రెస్ ఎంపి అభ్యర్థి వంశీచంద్‌రెడ్డి**



ఆలయంలో చల్లా వంశీచంద్‌రెడ్డి పూజలు

**మహబూబ్‌నగర్ బ్యూరో, మార్చి 27 ప్రభాతవార్త:** తిరుమలాథస్వామి ఆశీస్సులతో రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో మహబూబ్‌నగర్ స్థానం నుంచి అత్యధిక మెజార్టీతో గెలుపొంది విజయం సాధిస్తానని, అందుకు ప్రతి ఒక్క కార్యకర్త, నాయకులు సహకారం అందించాలని మహబూబ్‌నగర్ కాంగ్రెస్ ఎంపి అభ్యర్థి సిడబ్ల్యుసి ప్రత్యేక ఆహ్వానితుడు చల్లా వంశీ చంద్‌రెడ్డి కోరారు. హన్వాడ మండలం మాదారం గ్రామంలోని స్వయంభూ శ్రీరాకమకొండ తిరుమలనాథస్వామి బ్రహ్మోత్సవాల పల్లకి సేవలో వంశీచంద్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనకు స్థానిక ప్రజలు ఘనస్వాగతం పలికారు. ఆలయాన్ని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారిని దర్శించుకోవడం సంతోషంగాఉందన్నారు. స్థానిక గ్రామస్తుల వినతి మేరకు ఆలయ అభివృద్ధికి సహకరిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం స్థానిక ప్రజలతో ముచ్చటించారు. పలు స్థానిక సమస్యలపై ఆరాతీసి త్వరలో పరిష్కరిస్తామని పేర్కొన్నారు. అర్హులైన ప్రతిఒక్కరికికాంగ్రెస్ పార్టీ ప్రకటించిన సంక్షేమ పథకాలన్ని కూడా తప్పకుండా అమలు పరుస్తామని హామీ ఇచ్చారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలిపించి ఆశీర్వదించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సురెందర్‌రెడ్డి, పిసిసి కార్యదర్శి ఎస్. వెంకటేష్, స్థానికనాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలి



**గద్వాల ప్రతినిధిమార్చి 27 ప్రభాతవార్త:** ప్రజా స్వామ్యంలో ఓటు ఎంతో విలువైనదని, రాబోయే పార్లమెంటు ఎన్నికలలో తమ ఓటు హక్కు వినియోగించుకునే విధంగా 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్క యువతి, యువకులను ఓటరుగా తమ పేరును నమోదు చేసుకోనే విధంగా చర్యలు చేపట్టడం జరుగుతుందని స్వీప్ మోడల్ అధికారి రమేష్ బాబు అన్నారు. బుధవారం కలెక్టర్ కార్యాలయంలోని తన ఛాంబర్ లో స్వీప్ కోర్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లాలో ఇప్పటి వరకు ఓటరుగా నమోదు కాని ప్రతి ఒక్కరూ తమ పేరును ఓటర్ గా నమోదు చేసుకునే విధంగా చర్యలు చేపట్టాలని అన్నారు. ముఖ్యంగా కళాశాలలో చదువుకునే విద్యార్థిని విద్యార్థులు ఏప్రిల్ 15 వరకు ఫామ్ -6 ద్వారా తమ పేరును ఓటరు జాబితాలో నమోదు చేసుకోవాలని సూచించారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు జిల్లాఓ స్వీప్ కార్యక్రమాలు నిర్వహించి ప్రతి ఒక్కరిని ఓటర్‌గా నమోదు చేయించేందుకు కృషి చేయడం జరుగుతుందన్నారు. ఇందులో భాగంగా ఏప్రిల్ 2వ తేదీన 5కే రన్ నిర్వహించి వివిధ కళాశాలల యువతి యువకులను భాగస్వాములు చేసి ఓటరు నమోదుపై అవగాహన కల్పించేందుకు చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో స్వీప్ కోర్ కమిటీ సభ్యులు డిఆర్‌డిఓ నర్సింగ్ రావు, డిపిఆర్ఓ అరిఫుద్దీన్, ఎమ్ఎఎల్‌డి కళాశాల ప్రిన్సిపాల్ సంపత్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా కోర్టు ప్రాంగణంలో వర్చువల్ ఈ సేవ కేంద్రం ప్రారంభం

**వనపర్తి ప్రతినిధి మార్చి 27 ప్రభాతవార్త:** రాష్ట్రంలో 32 ఈ సేవ కేంద్రాలను ఆన్‌లైన్ అనగా వర్చువల్ ద్వారా భారతదేశ అత్యున్నత న్యాయస్థానం చీఫ్ జస్టిస్ డివై చంద్రచూడ్ చేతుల మీదుగా ప్రారంభించడం జరిగింది. దానిలో భాగంగా మనం వనపర్తి జిల్లా కోర్టు ప్రాంగణంలో కూడా ఈ సేవా కేంద్రాన్ని ప్రారంభించడం జరిగింది. తదనంతరం ఎమ్.ఆర్ సునీత ప్రధాన జిల్లా న్యాయమూర్తి ,వి.రజనీ ప్రధాన సీనియర్ సివిల్ జడ్జి ఈ కార్యక్రమంలో పాల్గొని రిబ్బన్ కటింగ్ చేసి ఈ సేవా కేంద్రాన్ని ప్రారంభించడం జరిగినది. ఇట్టి కార్యక్రమంలో ప్రాన్సిస్ చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ ,చిన్నమ్మ గ్రేడ్ ఈ సీనియర్ సినోగ్రాఫర్, అయ్యప్ప రెడ్డి సూపరిండెంట్ , గౌరెడ్డి కోటేశ్వర్ రెడ్డి సూపరిండెంట్ పి.జి సింధు , సీనియర్ అసిస్టెంట్ , సిస్టమ్ ఆఫీసర్ ఫిరోజ్ , తదితర కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## టెట్‌కు అనుమతి తప్పనిసరి నిబంధనను సడలించాలి

**ఉప్పునుంతల, మార్చి27 ప్రభాతవార్త:** సర్వీసులో కొనసాగుతున్న ఉపాధ్యాయులకు ప్రమోషన్ కోసం ఉపాధ్యాయ అర్హత పరీక్షకు జిల్లా విద్యాధికారి అనుమతి తీసుకోవాలని విషయం సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారడంతో పరీక్షకుసిద్ధమవుతున్న ఉపాధ్యాయులు అయోమయానికి గురవుతున్నారు. ఇటీవల ఎన్సీ ఈఆర్టీ ఉపాధ్యాయుల తదుపరి ప్రమోషన్ పొందుటకు ఉపాధ్యాయ అర్హత పరీక్ష 2 ఉత్తీర్ణత తప్పనిసరి చేయడంతో పెద్ద సంఖ్యలో ఉపాధ్యాయులు అర్హత కోసం టెట్ 2 పరీక్ష కోసం దరఖాస్తుకు సిద్ధమవుతున్నారు. తదుపరి ప్రమోషన్ కోసం అర్హత పరీక్షను తప్పనిసరి చేయడంతో విధిలుని పరిస్థితుల్లో సీనియర్ ఉపాధ్యాయులు ఆన్‌లైన్ దరఖాస్తుకు మొగ్గు చూపుతున్నారు. ఇందులో జిల్లా విద్యాధికారి అనుమతి తప్పనిసరి చేయడం అనే నిబంధనను సడలించాలని వారు కోరుతున్నారు. నేటి వరకు పదవ తరగతి పరీక్షల విధుల్లో ఉన్న ఉపాధ్యాయులు శుక్రవారం తిరిగి పాఠశాలల విధుల్లో చేరుతారు. ఏప్రిల్ మొదటివారంలో ఎన్నికల శిక్షణ కార్యక్రమాలు ఉండే అవకాశం ఉందని పలువురు అంటున్నారు. ఆ తర్వాత ఏప్రిల్ 8వ తేదీ నుంచి 6నుండి 9వతరగతి విద్యార్థులకు వార్షిక పరీక్షలు నిర్వహించాల్సి ఉంటుందని వారు వివరిస్తున్నారు. అనంతరం పరీక్షా ఫలితాలు వెల్లడించాల్సి ఉంటుంది. సమయాభావం తక్కువగా ఉన్నందున ఉన్నతాధికారి అనుమతిని సడలించాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు. టెట్ 2 దరఖాస్తుకు పరీక్షకు సమయం చాలా తక్కువగా ఉందని ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే 60 నుంచి 70 శాతం సర్వీస్ పూర్తి చేసుకున్న ఉపాధ్యాయులు ప్రమోషన్ల కోసం మరోసారి పుస్తకాలతో కుస్తి పట్టాల్సి వస్తుందని వాపోతున్నారు.

## నేడు సింగిల్ విండో మహాజనసభ

**ఉప్పునుంతల, మార్చి 27 ప్రభాతవార్త:** స్థానిక ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం, కార్యవర్గ సభ్యుల సర్వసభ్య సమావేశం నేడు గురువారం, డిసిసిబి డైరెక్టర్, సింగిల్ విండో ఛైర్మన్ సత్తుభూపాల్‌రావు అధ్యక్షతన ఉదయం 11 గం.లకు నిర్వహిస్తున్నట్లు సింగిల్ విండో ముఖ్య కార్యనిర్వహణాధికారి, సిఈఓ కొత్త రవిందర్‌రావు తెలిపారు. సమావేశంలో గత సంవత్సరం అక్టోబర్ నుంచి ఈ సంవత్సరము మార్చి వరకు సింగిల్‌విండోలో జరిగిన లావాదేవీలను జమ ఖర్చుల వివరాలను ఆమోదించుట గురించి సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. అదేవిధంగా 2024 ఏప్రిల్ నుండి సెప్టెంబర్ వరకు ఆర్థిక సంవత్సరం అంచనా బడ్జెట్‌ను రూపొందించుటకు జరిగే సమావేశాన్ని సంఘ సభ్యులు, కార్యవర్గ సభ్యులు తప్పనిసరిగా సకాలంలో హాజరు కావాలని ఆయన కోరారు.

## పంచాయతీ కార్మికుడిపై దాడి చేసిన వారిని శిక్షించాలి

**పానగల్, మార్చి 27, ప్రభాతవార్త :** జోగులాంబ గద్వాల జిల్లా లత్తిపురం గ్రామానికి చెందిన పంచాయతీ కార్మికుడు శ్రీను పై దాడి చేసిన వారిని వెంటనే శిక్షించాలని మండల సిఐటియు గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు కార్యదర్శిలు యాదగిరి సుగ్రీవుడు లు అధికారులను కోరినట్లు తెలిపారు. బధవారం గద్వాల జిల్లా పంచాయతీ కార్మికుల యూనియన్ ఆధ్వర్యంలో అధికారులకు పిర్యాదు చేసినట్టు తెలిపారు. లతిపురు గ్రామానికి చెందిన అంజి స్థానిక పంచాయతీ కార్యదర్శితో గొడవ పడుతుండగా అడ్డుకోబోయిన శ్రీను తో దూసిస్తూ దాడి చేయడం సబబు కాదని వారు హెచ్చరించారు. వచ్చే గ్రామాన్ని గా తీర్చిదిద్దే కార్మికులపై దాడి చేయడం సహించబోమన్నారు. వారి వెంట కోశాధికారి కిసాన్ నాయక్, ఏళ్లస్వామి తదితరులు ఉన్నారు.

## ముగిసిన కరాటే శిక్షణ తరగతులు

**మిడ్జిల్, మార్చి 27 ప్రభాతవార్త:** మండల పరిధిలోని సిల్వేరు గ్రామ ప్రాథమికోన్నత పాఠశాలలో కేంద్ర ప్రభుత్వం రాణీ లక్ష్మిబాయి ఆత్మ రక్షణ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శ్యామల మాట్లాడుతూ బాలికలపై తరచు ఏదో ఒక ప్రాంతంలో జరుగుతున్న అఘాయిత్యాలను చూసి తల్లిదండ్రులు బాలికల రక్షణకై దిగులు పడుతున్న సమయంలో ప్రభుత్వం బాలికలకు రక్షణగా కరాటే శిక్షణ ప్రత్యేక పాత్ర పోషిస్తుందని తెలిపారు. బాలికలలో ఆత్మ విశ్వాసం ధైర్యం నింపడానికి కరాటే శిక్షణ నేర్పించామని తెలిపారు. ఈ శిక్షణకు విద్యార్థులుఎలాంటి అలసట లేకుండా కరాటే శిక్షణలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు గురుప్రసాద్, వెంకటయ్య, ఆర్య శ్రీలత, రమేష్‌గౌడ్, కరాటే మాస్టర్ మల్లేష్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## విరక్తమఠం ఉత్సవాలలో అందరూ పాల్గొనండి

**మక్తల్, మార్చి 27 ప్రభాతవార్త:** మండలంలోని జక్లేర్ గ్రామ వాస్తవ్యులు అయిన లక్ష్మినరసింహ ఇంటిపూజ కార్యక్రమంలో శ్రీశ్రీశ్రీ పశ్చిమాది సంస్థాన విరక్తమఠం సిద్ధిలింగస్వాములవారు, ఆదిత్య పరశ్రీ స్వామి (బిజ్వార్‌స్వామి) తదితర స్వాములు పాల్గొని నూతన గృహంలోకి ప్రవేశించిన కుటుంబ సభ్యులకు తమ ఆశీర్వాదాలు అందించి దీవించారు. అదేవిధంగా సిద్ధిలింగస్వామి మాట్లాడుతూ త్వరలో నేరడుగాం మఠం ఆధ్వర్యంలో నిర్వహించే జాతర మహోత్సవాలకు భక్తులు పెద్ద ఎత్తున హాజరై స్వాముల వారి ఆశీర్వాదాలు పొందగలరని విజ్ఞప్తి చేశారు.

## 41వ రోజు కొనసాగుతున్న దీక్ష

**రేవల్లి మార్చి27 ప్రభాతవార్త:** రేవల్లి మండల పరిధిలోని బండరావి పాకుల గ్రామం శ్రీ ఏదుల వీరాంజనేయ ప్రాజెక్టులో బండరాయిపాకుల, కొంకలపల్లి 2015 లో ముంపునకు గురయింది. కొందరికి పునరావాసం డబ్బులు రాలేదు. ముగ్గరికి సంవత్సరాలు గడుస్తున్నా పరిహారం అందలేదు. 41 రోజుల నుంచి దీక్ష చేస్తున్న అధికారుల నుండి ఎలాంటి సమాచారం లేదని అధికారుల తీరుకు నిరసనగా బాధితులు దీక్ష 41 రోజుకు చేరింది. స్పందించడం లేదని వ్యక్తం చేస్తున్నారు. దీక్ష చేస్తూ వారి నిరసనను తెలియజేశారు. మంది నెలలు గడుస్తున్నా మాకు పునరావాసం డబ్బులు కొత్త గ్రామంలో ఇండ్లస్థలాలు ఇవ్వడం లేదని పాత గ్రామంలో దొంగల బెడద ఉందని మాకు భద్రత కల్పించాలని వారు కోరారు. అధికారులు స్పందించే వరకు దీక్ష విరమించేది లేదని అవసరమైతే దీనికైనా ముందుకు పోతానని సుకుమార్‌రెడ్డి అన్నారు. ఒక టోకెన్ నెంబర్ ఇచ్చారు. కానీ ఎలాంటి నష్టపరిహారం నగదును ఖాతాలో జమ చేయలేదని అన్నారు. అధికారులు ఈ సమస్యను పరిష్కరించాలని వేడుకుంటున్నాడు.

## పాఠశాలలను తనిఖీ చేసిన ఏంఎవో

**మహబూబ్‌నగర్, మార్చి 27, ప్రభాతవార్త:** మహబూబ్‌నగర్‌లోని పలు పాఠశాలలను ఏఎంలో దుంకుడు శ్రీనివాస్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. హౌసింగ్ బోర్డులోని ప్రాథమిక పాఠశాల, రెండో తరగతి, మూడో తరగతి విద్యార్థుల చేత లైబ్రరీ పీరియడ్ పరిశీలనలో భాగంగా పాఠశాలల్లో కథల పుస్తకాలను చదవించారు. విద్యార్థులు ఆసక్తిగా కథలు చదవడాన్ని ఆయన గుర్తించారు. అనంతరం దివిటిపల్లిలోని ప్రాథమిక ఉన్నత పాఠశాలలో హాజరు, విద్యార్థుల సామర్థ్యాలను ఆయన పరిశీలించారు.

## పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించిన ఎస్పీ

**గద్వాల ప్రతినిధి మార్చి 27 ప్రభాతవార్త:** గురువారం జరగనున్న మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల శాసన మండలి ఉప ఎన్నికలకు సంబంధించి గద్వాల్ మండల ప్రజా పరిషత్ కార్యాలయం (ఎం.పి.డి.ఓ)లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని జిల్లా ఎస్పీ రితిరాజ్, పరిశీలించారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన పోలీస్ బందోబస్తు ను పర్యవేక్షించారు. ఎస్పీ వెంట డి ఎస్పీ, సీఐ, ఎస్సైలు, సిఈఓ తదితరులు ఉన్నారు.

## డోలారోహణ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే

**మక్తల్, మార్చి27 ప్రభాతవార్త:** నారాయణపేట జిల్లా మక్తల్ నియోజకవర్గ కేంద్రం ద్వారక ఫంక్షన్ హాల్‌లో డా. ప్రాణేష్ కుమారుడి వివాహానికి, డోలారోహణ కార్యక్రమాలకు ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. మాజీ జడ్పీటిసి లక్ష్మారెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గణేష్, మాజీ ఉపసర్పంచ్ కట్ట సురేష్, మాజీ మార్కెట్ ఛైర్మన్ రవియాదవ్, బోయ నరసింహ పాల్గొన్నారు.

# మోడీయే మా ప్రధానీ..

- ఎక్కడెకెళ్లినా అంతా ఒకే మాట..
- కేసీఆర్ ఎంపీగా పాలమూరుకు చేసిందేమీ లేదు..
- గ్యారంటీల పేరుతో కాంగ్రెస్ మోసం
- అహంకారంతో విర్రవీగితే బోర్లా పడక తప్పదు
- బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు, మహబూబ్‌నగర్ ఎంపీ అభ్యర్థి డీకే అరుణ
- జడ్చర్లలో బీజేపీ పార్లమెంటరీ కార్యాలయం ప్రారంభం



సమావేశంలో మాట్లాడుతున్న డీకే అరుణ

**మహబూబ్‌నగర్‌బ్యూరో, మార్చి27, ప్రభాతవార్త:** ఎక్కడికెళ్లినా మోడీ మాటే వినిపిస్తుందని, మళ్లీ ప్రధానీ ఆయనే కావాలని ఘంటాపథంగా చెబుతున్నారని బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు, మహబూబ్‌నగర్ ఎంపీ అభ్యర్థి డీకే అరుణ అన్నారు. మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల లోని బీజేపీ పార్లమెంటరీ కార్యాలయాన్ని ఆమె ప్రారంభించి అనంతరం మీడియాతో మాట్లాడారు. గతంలో మహబూబ్‌నగర్‌కు ఎంపీగా పని చేసిన వారిలో మల్లికార్జున్,విఠల్‌రావు తప్పా ఎవరు ఏమీ చేయలేదన్నారు. కేసీఆర్‌ను ఎంపీగా పాలమూరు ప్రజలు గెలిపిస్తే ఆయన జిల్లాను పట్టించుకోలేదని ఆరోపించారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అవినీతి, అరాచక, భూదందాలు, మాఫియాపై పోరాటం చేసిందని తెలిపారు.కాంగ్రెస్ పార్టీని రేవంత్‌రెడ్డిని చూసి ప్రజలు ఓట్లు వేయలేదని చెప్పారు.ఆరు గ్యారంటీలు చెప్పి ప్రజలను మోసం చేసిందని, నేటికీ ఒక్క పథకం కూడా సక్రమంగా అమలు చేయలేదన్నారు. రైతులరుణమాఫీ, నిరుద్యోగభృతి, మహిళలకు రూ.2500, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ ఏఒక్కటి అమలు చేయలేదని, 100 రోజుల్లో అమలు చేస్తామని చెప్పి ఇప్పుడేమో రాష్ట్రంలో 17ఎంపీ స్థానాలు గెలిపిస్తే దేశంలో ప్రధాని మోడీ అవుతాడని అప్పుడు పథకాలు అమలు చేస్తామని చెబుతున్నారని ప్రజలునమ్మి మోసపోవొద్దన్నారు. రాహుల్ ప్రధాని అంటే ఇండియా ఊకటమి ఒప్పుకోవడం లేదని, అయినా రాష్ట్రంలో 17స్థానాలు గెలుస్తుందా అంటూ ఆశ్చర్యం వ్యక్తం చేశారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో కర్ణాటకలో 24సీట్లు, తెలంగాణలో 10-12 స్థానాల్లో బీజేపీ విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్ర అభివృద్ధికి మోడీ సహకారం అవసరమని స్వయంగా రేవంత్‌రెడ్డిప్రకటించారని, పాలమూరుఅభివృద్ధి చెందాలన్న, రాష్ట్రాబివృద్ధి జరగాలన్న కేంద్రంలో మోడీ ప్రభుత్వంతోనే సాధ్యమన్నారు. అహంకారంతో విర్రవీగితే బోర్లా పడక తప్పదని గత ప్రభుత్వ గతే పడుతుందని దుయ్యబట్టారు.ఢిల్లీలో మోడీ,పాలమూరులోఅరుణమ్మ అనే నినాదంతో పార్టీ శ్రేణులు ముందుకుసాగాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీజిల్లా అధ్యక్షుడు పిశ్రీనివాస్‌రెడ్డి,జిల్లా నాయకుడు జక్కా రఘునందన్‌రెడ్డి, నాయకురాలుబాలాత్రిపుర సుందరి, నియోజక వర్గ ఇన్‌చార్జిఅజయ్,మహిళా మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి సాహితీరెడ్డి, జడ్చర్లపట్టణాధ్యక్షుడునాగరాజు, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## కార్యకర్తలతో పార్లమెంట్ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డి ముఖాముఖి



**బాలానగర్,మార్చి 27 ప్రభాతవార్త:** కాంగ్రెస్ పార్టీ పాలమూరు ఎంపి అభ్యర్థి వంశీచంద్‌రెడ్డి, పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులను, కార్యకర్తలను కలుసుకున్నారు. బాలానగర్ మండల పరిధిలోని తిరుమలగిరి గ్రామంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు తిరుమలయ్య ఇంటి ఆవరణలో కార్యకర్తలతో పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించి ముఖా ముచ మాట్లా డడం జరిగిందని పార్టీ నాయకులు తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఓటువేసి అభ్యర్థులను గెలిపించుకోవాలని ఆయన ఈ సందర్భంగా కార్యకర్తలకు విజ్ఞప్తి చేశారు. అనంతరం పెద్దరేవల్లి తిరుమలనాథస్వామి గుట్టపై పూజా కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా యువజన ప్రధాన కార్యదర్శి మోహన్‌నాయక్, మాజీ సర్పంచ్ హనుమంతునాయక్, కాంగ్రెస్‌పార్టీ సీనియర్ నాయకులు తిరుమలయ్య, యూత్ గ్రామాధ్యక్షులు బద్రి నాయక్, సీనియర్ నాయకులు అంజయ్య, మాజీ సర్పంచ్ రాంజీ నాయక్, మాజీ వార్డు మెంబర్ రామచంద్రయ్య తదితర కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కౌంటింగ్ కేంద్రం పరిశీలన

**మహబూబ్‌నగర్, మార్చి27, ప్రభాతవార్త:** మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల నియోజకవర్గ ఉప ఎన్నిక కౌంటింగ్ ఈనెల2న నిర్వహించనున్నారు. ఈమేరకు జిల్లా కేంద్రంలోని బాలుర జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రాన్ని రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ జి రవి నాయక్ పరిశీలించారు. కౌంటింగ్ కేంద్రంలోని స్ట్రాంగ్ రూం, కౌంటింగ్ హాల్, పోలింగ్ బాక్సులు భద్రపరిచే గదిని క్షుణ్ణంగా పరిశీలించారు. కౌంటింగ్ ఏర్పాట్లు, కౌంటింగ్ సిబ్బందికి ఏర్పాట్లను పరిశీలించారు. గురువారం పోలింగ్ అనంతరం పోలింగ్ కేంద్రాల నుంచి వచ్చే బాక్సులు రిసెప్షన్ కేంద్రంలో అప్పజెప్పడంపై ఆర్డీవోకు సూచనలు చేశారు. కలెక్టర్ వెంట జిల్లా అధికారులు ఉన్నారు.

## బిజెపిలోకి చేరికలు



**ఉప్పునుంతల,మార్చి 27 ప్రభాతవార్త :** మండలంలో వివిధ గ్రామాలకు చెందిన బిఆర్ఎస్ నాయకులు బుధవారం నాగర్‌కర్నూల్ పార్లమెంట్ సభ్యులు పోతుగంటి రాములు, ప్రస్తుతం పార్లమెంట్ అభ్యర్థి పోతుగంటి భరత్ ఆధ్వర్యంలో బిజెపి పార్టీలో చేరారు. వారికి పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. బిఆర్ఎస్ పార్టీ విధానాలు నచ్చక ప్రస్తుతం మోడీ మరోసారి ప్రధానమంత్రి కావడం ఖాయం కావడంతో బిఆర్ఎస్ నుంచి బిజెపిలో చేరినట్లు వారు పేర్కొన్నారు. బిజెపిలో చేరిన వారిలో లక్ష్మాపూర్ గ్రామానికి చెందిన సిరసనగండ్ల కర్ణాకర్‌రావు, కంసాన్‌పల్లి తండాకు చెందిన రవినాయక్‌లతో పాటు పలువురు పార్టీలో చేరారు.

## వరకట్న వేధింపులకు భూత్పూర్ వాసికి పదేళ్ల జైలుశిక్ష

**మక్తల్,మార్చి 27 ప్రభాతవార్త :** మక్తల్ మండలం భూత్పూర్ గ్రామానికి చెందిన నర్సింహ అనే నిందితుడికి వరకట్న వేధింపుల కేసులో జిల్లా జడ్జి మహ్మద్ అబ్దుల్ రఫీ 10 ఏళ్ల జైలుశిక్ష విధించారు. దానితో పాటు 20 వేల జరిమానా విధిస్తూ బుధవారం తీర్పు వెల్లడించారని, ఎస్పీ యోగేష్ గౌతమ్ తెలిపారు. నర్సమ్మ అనే మహిళను నరసింహ ప్రేమ వివాహం చేసుకుని కట్నం తేవాలని వేధింపులకు గురి చేయడంతో ఆమె 2020 సంవత్సరంలో గ్రామ శివారులోని రిజర్వాయర్‌లో దూకి ఆత్మహత్య చేసుకున్నారు.

# ఎమ్మెల్సీ ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి

- ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు బ్యాలెట్ రూపంలో ఎమ్మెల్సీ ఎన్నికలు
- నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్



ఎన్నికల కేంద్రాన్ని పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, మార్చి27 ప్రభాతవార్త:** నాగర్‌కర్నూల్ పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల పైక భవనంలో ఏర్పాటు చేసిన శాసనమండలి ఎన్నికల పోలింగ్ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ పి.ఉదయ్ కుమార్ బుధవారం సాయంత్రం సందర్శించి వసతులను పరిశీలించారు. గురువారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు కొనసాగనున్న ఎన్నికల ప్రక్రియను అత్యంత పకడ్బందిగా నిర్వహించాల్సిందిగా అధికారులను ఆదేశించారు. నాగర్‌కర్నూల్ నియోజకవర్గ పరిధిలో 101 మంది ఓటర్లు బ్యాలెట్ రూపంలో తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నట్లు జిల్లా కలెక్టర్ వెల్లడించారు. ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఎన్నికలను సజావుగా నిర్వహించేలా చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టర్ వెంట నాగర్‌కర్నూల్ ఆర్డీఓ సురేష్, నాగర్‌కర్నూల్ తహసీల్దార్ చంద్రశేఖర్ ఇతర అధికారులు తదితరులు ఉన్నారు.

# అధికారులు సమన్వయంతో కలిసి పనిచేయాలి

- వనపర్తి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ తేజస్ నందలాల్ పవర్



ప్రజావాణి హాల్లో సెక్టార్ అధికారులకు దిశానిర్దేశం చేసిన జిల్లా కలెక్టర్

**వనపర్తి ప్రతినిధి, మార్చి27, ప్రభాతవార్త:** బుధవారం ఉదయం ఐ.డి.ఓ.సి లోని ప్రజావాణి హాల్లో ఏర్పాటు చేసిన సెక్టార్ అధికారులు పోలీస్ సెక్టార్ అధికారుల సమావేశంలో కలెక్టర్ పాల్గొని దిశానిర్దేశం చేశారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారికి సెక్టార్ అధికారులు ప్రతినిధులని వారు ఎంత సమర్థవంతంగా పనిచేస్తే ఎన్నికలు అంత సజావుగా ప్రశాంతంగా పూర్తి అవుతుందన్నారు. అందుకే సెక్టార్ అధికారులు సమన్వయంతో పని చేస్తూ స్థానిక వ్యక్తులతో పరిచయం ఏర్పాటు చేసుకోవడం రూట్ సరిగ్గా అర్థం చేసుకోవడం స్థానిక సమస్యలను ఆకళింపు చేసుకొని ఎన్నికల నిర్వహణలో కీలక పాత్ర పోసించాల్సి ఉంటుందన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో ఎన్నికల రోజున కనీస మౌలిక సదుపాయాలు ఉండే విధంగా చూసుకోవాలని సూచించారు. వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకొని ప్రతి పోలింగ్ కేంద్రంవద్ద చలువ నీడ ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. అదనపు కలెక్టర్ రెవెన్యూ యం.నగేష్ ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు రమేష్‌రెడ్డి సెక్టార్ ఆఫీసర్లకువారి బాధ్యతల పై అవగాహన కల్పించారు. త్వరలోనే పూర్తిస్థాయి శిక్షణ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. సక్టార్ అధికారులు పోలీస్ సెక్టార్ అధికారులు పాల్గొన్నారు.

## సకల సౌకర్యాలతో సిద్ధమైన స్థానిక సంస్థల ఎన్నికల పోలిగ్ కేంద్రం



**వనపర్తి ప్రతినిధి మార్చి 27 ప్రభాతవార్త:** స్థానిక సంస్థల ఎన్నికల మార్చి 28 న గురువారం జరగబోయే మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉప ఎన్నికకు వనపర్తి ఆర్డీఓ కార్యాలయంలో 4వ నెంబర్ పోలింగ్ కేంద్రం సకల సౌకర్యాలతో సిద్ధమైంది.బుధవారం సాయంత్రం జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అదనపు కలెక్టర్ రెవెన్యూ యం.నగేష్ తో కలిసి పోలింగ్ కేంద్రాన్ని సందర్శించారు.218 మంది ఓటర్లలో కూడిన 4వ నెంబర్ పోలింగ్ కేంద్రంలో ఏర్పాటు చేసిన మౌలిక సదుపాయాలను కలెక్టర్ పరిశీలించారు.ప్రశాంత వాతావరణంలో పోలింగ్ జరిగేలా చూడాలని అధికారులకు సూచించారు.పోలింగ్ కేంద్రం చుట్టూ వంద మీటర్ల పరిధిలో 144 సెక్షన్ అమలు చేయాలని,అనుమతి లేని వ్యక్తుల్ని పోలింగ్ కేంద్రం పరిసరాల్లో అనుమతించవద్దని అధికారులను ఆదేశించారు.అదనపు కలెక్టర్ రెవెన్యూ యం.నగేష్, ఆర్డీఓ పద్మావతి,ఎన్నికల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# లైంగిక వేధింపుల నిరోధక చట్టంపై అవగాహన సదస్సు

### -సఖి కోఆర్డినేటర్ సునిత



అవగాహన కరపత్రాలను విడుదల చేస్తున్న దృశ్యం

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, మార్చి 27 ప్రభాతవార్త:** నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని నెల్లికొండ ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాలలో కళాశాల ప్రిన్సిపల్ కమర్ షాజహాన్ సుల్తానా మహిళా సాధికారిత సెల్ ఆధ్వర్యంలో పీఓఎస్ఎస్ చట్టం 2013పై నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి సచ కోఆర్డినేటర్ సునిత హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పీఓఎస్‌హెచ్ చట్టం మరియు పని ప్రదేశాల్లో దాని ప్రాముఖ్యత గురించి అధ్యాపకులకు విద్యార్థులకు చాలా క్లుప్తంగా వివరించారు. అనంతరం ప్రిన్సిపాల్ మాట్లాడుతూ పని ప్రదేశాల్లో వేధింపులకు గురైనప్పుడు సంబంధిత కమిటీకి ఫిర్యాదు రూపంలో తెలియజేయాలని, అట్టి సమస్యను 90 రోజుల్లో పరిష్కరించాలని, విద్యార్థులు ఇలాంటి వివిధ చర్యలపై మరింత అవగాహన పెంచుకోవాలన్నారు. మహిళా సాధికారిత సమన్వయకర్త ఉమాదేవి మాట్లాడుతూ విద్యార్థినులు సమాచారాన్ని వీలైనంత వరకు తమ కుటుంబ సభ్యులు, పని ప్రదేశాల్లో, పరిసరాల్లో ప్రచారం చేయాలని కోరారు. ఇటువంటి విజ్ఞాన సభను ఏర్పాటు చేసినందుకు సచ సెంటర్ వారికి అధ్యాపకులు మరియు విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం అవగాహన కరపత్రాన్ని విడుదల చేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ షేక్ ఖాజాబీ, అధ్యాపకులు రమ్య శైలజ తదితరులు ఉన్నారు.

# ముగిసిన అలివేలుమంగతాయారు బ్రహ్మోత్సవాలు



**దేవరకద్ర,మార్చి 27 ప్రభాతవార్త:** జిల్లాలోని పేరెన్నికగన్న మన్యంకొండ శ్రీ అలివేలుమంగతాయారు బ్రహ్మోత్సవాలు బుధవారం ఘనంగా ముగిసాయి. మన్యంకొండలో శ్రీ అలివేలుమంగతాయారు భ్రహోత్సవాల ఈ నెల23న ప్రారంభమయ్యాయి. అలాగేఈ నెల 25న తిరుకళ్యాణ మహోత్సవం,అదే రోజు రాత్రి అమ్మవారి రథోత్సవాన్ని కూడ కన్నుల పండువలా నిర్వహించారు. దాదాపు వారం రోజుల పాటు అమ్మవారి ఉత్సవాలను సాంప్రదాయరీతిలో ఎంతో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ప్రతి రోజు పలు సేవలను నిర్వహించారు. ఈ ఉత్సవాలకు జిల్లా నలుమూలల నుండి కొన్ని వేల మంది భక్తులు అధికసంఖ్యలో మన్యంకొండకు తరలివచ్చి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవాల చివరిరోజు అమ్మవారి వసంతోత్సవాన్ని నిర్వహించారు. పురోహితుల వేధమంత్రాలు,భక్తుల హరినామశ్చరణల మద్య అమ్మవారి సుదర్శనపెరుమాళ్ళను ఊరేగింపుగా ఘాటురోడ్డు గూండా గుట్టపై ఉన్న కోనేరువద్దకు తీసుకెళ్ళారు. అక్కడ నీటిలో పలు పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు,తదితర పూజలను నిర్వహించారు.రకరకాల పూలు,బంగారు ఆభరణాలతో అమ్మవారిని అలంకరించారు.ఈ కార్యక్రమంలో దేవస్థానం చైర్మెన్ అళహరి మధుసూధన్‌కుమార్,అళహరి రామకృష్ణ,ఈఓ శ్రీనివాసరాజు, ప్రధాన పూజారులు రాజేశ్,నరసింహ్మయ్య,పాలకమండలి సభ్యులు,పర్యవేక్షకుడు నిత్యానందచారి,సిబ్బంది పాల్గొన్నారు.

**ఘనంగా పూర్ణాహుతి,హోమం:** మన్యంకొండ శ్రీ అలివేలుమంగతాయారు భ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని దేవస్థానంలో పురోహితులు పూర్ణాహుతితో పాటు హోమాన్ని సాంప్రదాయరీతిలో వైభవంగా నిర్వహించారు.దేవస్థానంలోని మండపంలోఅమ్మవారి సన్నిధిలో ఈ పవిత్రకార్యక్రమాలను నిర్వహించారు. దేవస్థానం చైర్మెన్ అళహరి మధుసూధన్ కుమార్ అధ్వర్యంలో పురోహితుల వేధమంత్రోశ్చరణల మద్య ఈ కార్యక్రమాన్ని భక్తిశ్రద్దలతో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం చైర్మెన్ అళహరి మధుసూధన్‌కుమార్,అళహరి రామకృష్ణ,ఈఓ శ్రీనివాసరాజు, ప్రధాన పూజారులు రాజేశ్,నరసింహ్మయ్య,పాలకమండలి సభ్యులు,పర్యవేక్షకుడు నిత్యానందచారి,సిబ్బంది సుదర్శన్,నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**మన్యంకొండలో అశ్వవాహనంపై ఊరేగిన అలివేలుమంగతాయారు:** మన్యంకొండ శ్రీ అలివేలుమంగతాయారు దేవస్థానంలో మంగళవారం రాత్రి అమ్మవారి అశ్వవాహనసేవ పూజా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. మన్యంకొండలో శ్రీ అలివేలుమంగతాయారు భ్రహోత్సవాల సందర్భంగా ఈ పవిత్ర కార్యక్రమాన్ని కన్నులపండువలా నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరస్వామి సమేతంగా అలివేలుమంగతాయారు అమ్మవారిని అశ్వవాహనంపై ఊరేగించారు.అమ్మవారి ఉత్సవాల సందర్భంగా ప్రాతిరోజు ఓ సేవను నిర్వహిస్తున్నారు. అందులో భాగంగానే ఈ పవిత్ర సేవ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా దేవస్థానం గర్భగుడి నుండి దేవస్థానం ముందున్న తేరుమైదానం వరకు అశ్వవాహనసేవ నిర్వహించారు. పురోహితుల వేధమంత్రాలు,భక్తుల హరినామశ్చరణ,కాగడాల వెలుతురులో అమ్మవారి సేవ ముందుకు కదిలింది. ఈ సేవను చూసి భక్తులు భక్తిపారవశ్యంతో పులకరించి పోయారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు,అర్చనలు, తదితర పూజలను నిర్వహించారు.అనంతరం అమ్మవారిని మళ్ళీ గర్భగుడిలోకి తీసుకెళ్ళారు. అక్కడ కూడ వివిద పూజలను నిర్వహించారు. ప్రత్యేక అభిషేకాలు,అర్చనలు నిర్వహించారు.

**అలంకరణలో దర్శనమిచ్చిన అలివేలుమంగ అమ్మవారు:** మన్యంకొండలో అశ్వవాహనసేవ సందర్భంగా అమ్మవారు అశ్వవాహనంపై స్వామి సమేతంగా ఊరేగుతూ అలంకరణలో భక్త కోటికి దర్శనమిచ్చారు. రకరకాల పూలు,బంగారు ఆభరణాలతో అమ్మవారిని అలంకరించారు. అమ్మవారి ఉత్సవాలను పురస్కరించుకొని జిల్లా నలుమూలల నుండి భక్తులు మన్యంకొండకు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం చైర్మెన్ అళహరి మధుసూధన్‌కుమార్,అళహరి రామకృష్ణ,ఈఓ శ్రీనివాసరాజు, ప్రధాన పూజారులు రాజేశ్,నరసింహ్మయ్య,పాలకమండలి సభ్యులు,పర్యవేక్షకుడునిత్యానందచారి,సిబ్బంది సుదర్శన్,నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**నేడు శ్రీలక్ష్మీనరసింహ్మాస్వామికి పూజలు:** మన్యంకొండ శ్రీ లక్ష్మీవెంకటేశ్వర స్వామి దేవస్థానం అనుబంద దేవలయమైన శ్రీ లక్ష్మీనరసింహ్మాస్వామి దేవస్థానంలో స్వామివారికి గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. శ్రీ అలివేలుమంగతాయారు భ్రహ్మోత్సవాలను ముగిసిన తరువాత స్వామివారికి పూజలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. అందులో భాగంగానే ఈ పూజలను దేవస్థానం చైర్మెన్ అళహరి మధుసూధన్‌కుమార్,అళహరిరామకృష్ణ అధ్వర్యంలో ఘనంగా నిర్వహిస్తారు.ఈ పూజలకు భక్తులు అధికసంఖ్యలో హాజరవుతారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు.

## సొంత పనులకు గ్రామ పంచాయతీ ట్రాక్టర్ వినియోగం!



**లింగాల,మార్చి 27 ప్రభాతవార్త:** పారిశుధ్య పనులకు వినియోగించుకోవాల్సిన గ్రామ పంచాయతీ ట్రాక్టర్‌ను తనసొంత పనులకు వాడుకుంటున్న సంఘటన మండల పరిధిలోని అంబట్‌పల్లి గ్రామంలో బుధవారం వెలుగు చూసింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామ పంచాయతీలో ఓ వ్యక్తి ట్రాక్టర్ డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. తన బాధ్యతలు విస్మరిస్తూ యదేచ్ఛగా గ్రామ పంచాయతీ పనలుకు వాడుకోకుండా తన సొంత పనులకు వాడుకుంటున్నట్లు తెలిపారు. గ్రామంలో అందరూ చూస్తుండగానే ప్రైవేట్ పనులకు గ్రామ పంచాయతీ ట్రాక్టర్ ట్రాలీలు తడఖలు, ఇతర పనులకు తీసుకెళ్లడం ప్రభుత్వ నిధులను దుర్వినియోగం చేస్తున్నారని గ్రామస్తులు మండిపడుతున్నారు. ఈ సంఘటనపై జిల్లా కలెక్టర్, జిల్లా పంచాయతీ అధికారి దృష్టికి తీసుకెళ్లడం జరిగిందని తెలిపారు. ఈ విషయంపై సంబంధిత అధికారులు విచారణ జరిపి ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని గ్రామస్తులు కోరారు. దుర్వినియోగానికి పాల్పడిన వ్యక్తిపై తగుచర్యలు తీసుకోవాలని కోరారు.

# కార్యకర్తలే పార్టీకి పునాదిరాళ్ళు

- 14 స్థానాల్లో గెలుస్తాం
- ఆశీర్వదించండి భారీ మెజార్టీతో గెలిపించండి
- మహబూబ్‌నగర్ పార్లమెంట్ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డి



**మహబూబ్‌నగర్ బ్యూరో,మార్చి 27 ప్రభాతవార్త:** రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో రాష్ట్రంలోని 17 ఎంపీ స్థానాలకు 14 స్థానాల్లో విజయం సాధిసామని, సిడబ్ల్యుసి ప్రత్యేక ఆహ్వానితుడు, కాంగ్రెస్ పార్లమెంటరీ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. మహబూబ్‌నగర్ పట్టణ కేంద్రంలో పట్టణ అధ్యక్షులు లక్ష్మణ్‌యాదవ్, పట్టణ వర్కింగ్ కమిటి అధ్యక్షుడు అజ్మత్ అలీ ఆధ్వర్యంలో సుదర్శన్ కన్వెన్షన్‌లో ఏర్పాటు చేసిన బూత్ లెవల్ ఏజెంట్ల సమావేశంలో సిడబ్ల్యుసి ప్రత్యేక ఆహ్వానితులు మహబూబ్‌నగర్ పార్లమెంట్ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డి పాల్గొని మాట్లాడారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో 14 స్థానాల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించబోతోందని ధీమా వ్యక్తం చేశారు. మన ప్రాంతాన్ని అభివృద్ధి పరచుకొని సాగు, తాగు నీరు ప్రతి ఒక్కరికి అందేలా కృషిచేస్తానన్నారు. కార్యకర్తలే పార్టీకి పునాదిరాళ్లు వారు కష్టపడి పని చేస్తేనే మన లక్ష్యాన్ని చేరుకుంటామన్నారు. పార్లమెంట్, ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ప్రతి ఒక్క కార్యకర్త, నాయకుడు కష్టపడి పని చేయాని కష్టపడ్డ వాళ్లకి తప్పక గుర్తింపు ఉంటుందని చెప్పారు.మహబూబ్‌నగర్ పార్లమెంట్ అభివృద్ధి బాటలో నడిపించే బాధ్యత తనదని, ఆశీర్వదించి పార్లమెంట్ ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పిసిసి కార్యదర్శి వినోద్‌కుమార్, సురెందర్‌రెడ్డి, ఎన్‌పి వెంకటేష్, సిరాజ్‌ఖాద్రి తదితరులు పాల్గొన్నారు.

## పాలెం వెంకన్న హుండీ లెక్కింపు

**బిజినేపల్లి,మార్చి 27 ప్రభాతవార్త:** పాలెం శ్రీ వెంకటేశ్వరస్వామి దేవస్థానం హుండీ లెక్కింపు కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. నాగర్‌కర్నూల్ జిల్లా దేవాలయ శాఖ పరిశీలకులు వెంకటేశ్వరి, ఆలయ కార్యనిర్వహణాధికారి సిహెచ్ రంగారావు ఆధ్వర్యంలో హుండీ లెక్కింపు చేపట్టారు. భక్తుల కానుకల రూపంలో ఆదాయం రూ. 3.88.673 ఆదాయం వచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు, మాజీ ధర్మకర్తలు సొప్పరి బాలస్వామి, బోనాసి పెద్ద కుర్మయ్య, బండారు జగదీష్‌కుమార్, జగన్మోహన్, శ్రీను, వెంకటేష్, శివకుమార్, ఆలయ సిబ్బంది బాబయ్య, గోపాల్,వెంకట్‌స్వామి, జ్యోతి శ్రీదేవి, బంగారమ్మ పాల్గొన్నారు.

## అభిమన్యురెడ్డి ఆర్థిక సాయం

**రాజాపూర్,మార్చి 27 ప్రభాతవార్త:** మండల పరిధిలోని ముదిరెడ్డిపల్లి గ్రామ పంచాయతీకి చెందిన వికృతి ఆంజనేయులు కూతురు సహస్ర వివాహానికి రూ.10 వేలు, గుండ్లపొట్లపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని రంగబాయితండాకు చెందిన జటావత్ పాండునాయక్ కూతురు సంజు వివాహానికి పదివేల రూపాయలు అభిమన్యు యువసేన సభ్యుల ద్వారా ఆర్థిక సహాయాన్నిబిఆర్ఎస్ పార్టీ యువనేత చించోడ్ అభిమన్యురెడ్డి అందజేశారు. కార్యక్రమంలో ఎంపిటిసి శేఖర్‌గౌడ్, మాజీ సర్పంచ్ పెంటయ్య, కో ఆప్షన్ నారాయణగౌడ్,శ్రీనివాస్‌రెడ్డి, వార్డు మెంబర్ రాములు, టంకరి జంగయ్య, కృష్ణయ్య, ఆంజనేయులు,బిఆర్ఎస్‌నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## తనిఖీల్లో రూ.3 లక్షల నగదు స్వాధీనం

**బాలానగర్,మార్చి 27 ప్రభాతవార్త:** ఎన్నికల తనిఖీలలో భాగంగా బాలానగర్ మండల కేంద్రం సమీపంలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టులో మూడు లక్షల రూపాయలను స్వాధీనం చేసుకోవడం జరిగిందని బాలానగర్ ఎస్సై తిరుపాజీ తెలిపారు. బుధవారం ఈ మేరకు వాహనాల తనిఖీ చేపడుతుండగా నారాయణపేట జిల్లా కోస్గి ప్రాంతానికి చెందిన అబ్దుల్ రెహమాన్ తన వాహనంలో మూడు లక్షల రూపాయలను తీసుకెళ్తుండగా తనిఖీ చేసి నగదు స్వాధీనం చేసుకోవడం జరిగిందని తెలిపారు. జిల్లా కేంద్రంలో గ్రీవియెన్స్ కమిటికి సంబంధిత ధృవపత్రాలు చూపించి నగదును తీసుకెళ్లాలని ఎస్సై తిరుపాజీ సూచించారు.

## జడ్చర్ల రాజకీయాల్లోకి జక్కా..!

మొదటి పేజీ తరువాయి భాగం..

నాయకుడి నుంచి ఆయన బీజేపీలో పని చేశారు. 2006-07లో జడ్చర్ల బీజేపీ ఇన్‌చార్జిగా, పార్టీ అధికార ప్రతినిధిగా పని చేశారు. 2009లో నాగంకర్నూల్ అసెంబ్లీ నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేసి మూడో స్థానంలో నిలిచారు. తదనంతరం సొంత గ్రామం తిమ్మాజిపేట మండలం నేరళ్లపల్లికి చెందిన నాగర్‌కర్నూల్ తాజా మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్ధన్ రెడ్డితో కలిసి ప్రయాణం సాగించారు. ఆయన వెన్నంటే ఆయన ప్రతి విజయంలోనూ కీలక పాత్రం పోషించారు 2012 టీడీపీ నుంచి పోటీ చేసిన మర్రి జనార్దన్‌రెడ్డి అడుగుల్లో అడుగులేశారు. 2014,2018లో నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యేగా మర్రిజనార్ధన్‌రెడ్డి విజయంలో తనదైన మార్క్ చూపించారు. నాగర్‌కర్నూల్ షాడో ఎమ్మెల్యేగా,మర్రి కుడి భుజంగా పేరున్న ఆయన కందనూలులో బీఆర్ఎస్ పటిష్టతకు ఆయన చేసిన కృషి ఎనలేనిదని చెప్పవచ్చు. ఎంజేఆర్ ట్రస్టు పేరిట అనేక సేవా కార్యక్రమాలు తనభుజం మీద వేసుకొని వేలాది మంది పేదల పెండ్లిళ్లు, ఆర్థికసాయం, విద్యాభివృద్ధికి ఆలయాభివృద్ధికి ఆయన ఎంతో కృషి చేశారు. కార్యక్రమాలు విజయవంతం కావడానికి జనాల్లోకి ట్రస్ట్ పరు ప్రతిష్టలు వెళ్లడానికి ఆయన కృషి అజరామరం.అయితే బీఆర్ఎస్ పార్టీని కందనూలు పదేండ్ల పాటు పదిలంగా ఉంచడం వెనక ఆయన శ్రమ ఎంతో ఉన్నది. పార్టీలో పదవులు దక్కకపోయినా, ఎన్నో విభేదాలు వచ్చినా నమ్మకానికి మారుపేరులా ఉన్నాడు తప్పా పార్టీని వీడలేదు. మర్రికి దూరంగా ఉండలేదు. ఒక నిబద్ధత, క్రమశిక్షణ కలిగిన నాయకుడిగా పేరు తెచ్చుకొన్న జక్కా పార్టీలో పదవులు రాకున్నా ఏనాడు పార్టీని వీడలేదు..ఆలోచన చేయలేదని సన్నిహితులు చెబుతున్నారు. ఇటీవల కేటీఆర్ నిర్వహించిన నాగర్‌కర్నూల్ పార్లమెంట్ సమావేశాల్లో జక్కాకు ప్రాధాన్యత ఇవ్వకపోవడం, ఫ్లెక్సీలో కూడా ఆయన ఫొటో లేకుండా చేయడంతో తీవ్ర మనస్థానం చెందారు. ఆయన సన్నిహితులు, తనకు విలువ ఇవ్వని చోట ఉండలేనని,తన అభిమానులు, నాయకులు, కార్యకర్తలు పార్టీనీ వీడాలంటూ ఒత్తిడి తేవడంతో బీజేపీ చేరేందుకు నిర్ణయించుకున్నారు. ఈక్రమంలో బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు, మహబూబ్‌నగర్ ఎంపీ అభ్యర్థి డీకే అరుణ ఆహ్వానం మేరకు ఢిల్లీలో కమలం గూటికి చేరారు.

**రెండు పార్లమెంట్ స్థానాల్లో కీలక బాధ్యతలు:** నాగర్‌కర్నూల్, మహబూబ్‌నగర్ పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు రఘునందన్‌రెడ్డి తెలిపారు. గత 20ఏండ్లుగా నాగర్‌కర్నూల్ జిల్లాపై పూర్తి పట్టు ఉండడంతో ఆయన అందరితోనూ సత్సంబంధాలు ఉన్నాయి. దీంతో రెండు పార్లమెంట్ స్థానాల్లో ఆయన బీజేపీ పటిష్టతకు, అభ్యర్థుల గెలుపులో కీలక పాత్రం పోషించనున్నారు. నాగర్‌కర్నూల్‌లో ఎంపీ అభ్యర్థి భరత్‌ప్రసాద్ గెలుపునకు జక్కా సేవలు ఎంతగానో ఉపయోగపడనున్నాయి. ఎంపీ రాములుతోపాటు ఆయన కుమారుడ ప్రస్తుతం ఎంపీ అభ్యర్థి భరత్‌తోకలిసి బీజేపీ తీర్థం పుచ్చుకున్నారు. అందరి సమన్వయ్యంతో కందనూలులో బీజేపీ జెండా ఎగురవేసేందుకు కృషి చేయనున్నారు. దీంతోపాటు ఇటు జడ్చర్లలో బుధవారం పార్లమెంట్ కార్యాలయంప్రారంభంతో స్థానికంగా ఉంటూ స్థానిక నాయకులు, కార్యకర్తలతో సమన్వయంతో పార్టీ బలోపేతంతోపాటు డీకే అరుణ గెలుపులో ప్రముఖ పాత్ర పోషించనున్నారు. 2006లో జడ్చర్ల నియోజకవర్గంలో బీజేపీలో పని చేసిన అనుభవం తనకు ఉండడంతో నాయకుల సమన్వయంతో జడ్చర్లలో బీజేపీ పూర్వ వైభవానికి కృషి చేయనున్నట్లు పార్టీ శ్రేణులు చెబుతున్నారు.

## జిల్లాలో స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉప ఎన్నికకు పకడ్బందిగా ఏర్పాట్లు పూర్తి..!

మొదటి పేజీ తరువాయి భాగం..

పట్టణంలో బాలికల ఉన్నత పాఠశాలలో 10వ తరగతి బి సెక్షన్ రూమ్, కల్వకుర్తి పట్టణలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల సమావేశ హాల్‌లో పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆయన తెలిపారు. పోలింగ్ ప్రశాంతంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ముందు జాగ్రత్త ఏర్పాట్లు చేసినట్లు కలెక్టర్ పేర్కొన్నారు. కలెక్టర్ వెంట అచ్చంపేట ఆర్డీఓ, ఇతర అధికారులు ఉన్నారు.